నల్లగొండ వార్త

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

సోమవారం 18, మే 2026 — 16 పేజీలు

సర్ పై అంతా అలర్ట్

జూన్ 25 నుండి ప్రారంభం

ఓటరు జాబితాలో అనర్హుల తొలగింపే సర్ లక్ష్యం

నిధులు స్వాహా



మింగిన నిధులను కక్కేదెవరో...!

ఎన్నికల పేరిట గ్రామ అభివృద్ధి నిధులు దుర్వినియోగం

ఆడిట్ వస్తే బయటపడనున్న బండారం

ఎక్కడ దొరికిపోతామోనని పంచాయతీ కార్య దర్శుల్లో వణుకు

పంచాయతీ నిధులతో ఎన్నికల ఖర్చుల సెటిల్మెంట్?

2 లో

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త: జిల్లాలో గ్రామపంచాయతీల నిధుల వినియోగంపై బయటపడుతున్న ఆరోపణలు జిల్లావ్యాప్తంగా రాజకీయ, అధికార వర్గాల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. ఎన్నికల నిర్వహణ ఖర్చుల పేరిట ప్రజల నుంచి వసూలైన ఇంటి పన్నులు, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, నిర్మాణ అనుమతుల ఫీజులు వంటి నిధులను ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయకుండా అంతర్గతంగా లెక్కలు సర్దుబాటు చేశారన్న ఆరోపణలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఎన్నికల సమయంలో ముందుగా ఖర్చులు పెట్టండి, తర్వాత ప్రభుత్వం నుంచి విడుదల అవుతాయటూ మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులను ఒత్తిడి చేసి ఎన్నికల ఏర్పాట్లు చేయించగా, ఇప్పుడు ఆ ఖర్చుల భారమంతా గ్రామపంచాయతీల ఖాతాలపై పడినట్లు సమాచారం.

పంచాయతీ పన్నులపై పెద్దల లెక్కల మాయాజాలం

చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది..

అయిటిపాముల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

2 లో

నకిరేకల్, మే 17, ప్రభాతవార్త, రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అన్నదాతలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం భరోసా ఇచ్చారు. ఆదివారం వారు మండలంలోని అయిటిపాములలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంయుక్తంగా పరిశీలించారు.

ఆస్తి వివాదం నేపథ్యంలో దారుణ హత్య

డీఎస్పీ రాజశేఖర్ రాజు పరిశీలన

2లో

హాలియా, ప్రభాతవార్త,మే 17: అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామంలో ఆస్తి వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొన్న దారుణ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రుద్రాక్ష సుమలత (40), ఆమె కూతురు రుద్రాక్ష లావణ్య (20)లను అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.

సర్ పై అంతా అలర్ట్

ఓటరు జాబితాలో అనర్హుల తొలగింపే సర్ లక్ష్యం

జూన్ 25 నుండి ప్రారంభం

జూలై 31న ఓటరు ముసాయిదా జాబితా ప్రకటన

జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ

అక్టోబర్ 1న తుది జాబితా విడుదల

అప్రమత్తమైన రాజకీయ పక్షాలు

సర్ పై కాంగ్రెస్ కార్యాచరణ ప్రారంభం

బూత్ లెవెల్ అసిస్టెంట్స్ కు శిక్షణ ఇవ్వనున్న బిఆర్ఎస్

ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట) ఓటరు జాబితాలో అర్హుల ఓట్లు మాత్రమే ఉండాలి. మృతి చెందిన వారు, ఇతర దేశాల్లో ఉంటున్న వ్యక్తుల పేర్లను ఓటర్ జాబితాల నుండి తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఓటరు జాబితాలో కేవలం అర్హుల ఓట్లు మాత్రమే ఉండాలన్నది సర్ లక్ష్యం. దేశ పౌరులు కాని వారు ఓటర్లుగా ఉండటానికి అవకాశం లేదని రాష్ట్ర ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ కార్యక్రమం రాష్ట్రంలో జూన్ 25న ప్రారంభం కానుంది. జూలై 24 వరకు బి ఎల్ వో లు ఇంటింటికి వెళ్లి సర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భారతదేశంలో ఇప్పటివరకు 10 సార్లు సర్ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరిసారిగా 2002లో సర్ కార్యక్రమం జరిగింది. తిరిగి 2026 లో జరుగుతుంది. ఎన్నికల సంఘం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి రెండు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారు. ఒక ఫారం పూర్తి చేసి బిఎల్ఓ కు ఇవ్వాలి. మరో ఫారం ఓటర్ల వద్ద రసీదు నిమిత్తం ఉంచుకోవాలి. గృహాలకు తాళాలు వేసి ఉంటే మరోసారి బిఎల్వోలు వెళ్లి ఫారాలు అందజేసే వివరాలను సేకరించాల్సి ఉంటుంది. ఆన్లైన్లో కేంద్ర ఎన్నికల సంఘం వెబ్సైట్ ద్వారా ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు. జూలై 24 వరకు సర్ ప్రక్రియ కొనసాగుతుంది. జూలై 31న ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. ఈ జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేస్తారు. ప్రధాన ఎన్నికల అధికారి వెబ్సైట్లో కూడా అందుబాటులో ఉంచుతారు. అంతేకాకుండా జిల్లా ఎన్నికల అధికారి, ఓటరు నమోదు అధికారి కార్యాలయాల వద్ద కూడా అందుబాటులో ఉంటాయి. ఓటరు ముసాయిదా జాబితా పై జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే విన్నవించవచ్చు. ఎన్యుమరేషన్ వారంలో సందేహాలు ఉంటే ఎన్నికల అధికారులు నోటీసులు ఇస్తారు. 12 గుర్తింపు కార్డులో ఏదో ఒకటి చూపించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. అక్టోబర్ 1న ఓటరు తుది జాబితాను ప్రకటిస్తారు. సందేహాలను ఓటర్ టోల్ ఫ్రీ నంబర్ 1950 ను అందుబాటులో ఉంచారు. ఈఆర్వోలు, బి ఎల్ వో లకు నాలుగు పర్యాయాలు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో సర్ కార్యక్రమానికి సంబంధించి సూచనలు, సలహాలు తెలియజేశారు. వలస కార్మికులు, గల్ఫ్ కార్మికులు ఆన్లైన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలను పంపవచ్చు. ఎన్యుమరేషన్ ఫారాలలో భర్తీ చేయాల్సిన వివరాలను కూడా ఎన్నికల సంఘం ప్రకటించింది. ఫారాలలో పేర్కొన్న అంశాలను తప్పనిసరిగా భర్తీ చేసి ఎన్యుమరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. సర్ పై ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రకటించిన నేపద్యంలో వివిధ రాజకీయ పక్షాలు అప్రమత్తమయ్యాయి. అర్హుల ఓట్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అంతా అలర్ట్ గా ఉండాలని ఆయా పార్టీల అధిష్టానాలు పార్టీ శ్రేణులకు సూచించాయి. కాంగ్రెస్ పార్టీ సర్ పై కార్యాచరణ మొదలు పెట్టింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జూమ్ మీటింగ్ కాంగ్రెస్ నిర్వహించింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ అభిమానులు, పార్టీ శ్రేణుల ఓట్లు తొలగించకుండా ఎక్కడికక్కడ జాగ్రత్త పడాలని వారు ఆదేశించారు. సాధారణ ప్రజల ఓట్లను రద్దు చేయకుండా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పని విభజన చేసుకొని అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వివిధ హోదాలలో ఉన్న ప్రజాప్రతినిధులు అలర్ట్ అయ్యారు. సర్ విషయంలో ప్రజలకు, పార్టీ శ్రేణులకు నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. పార్టీ అధిష్టానం సూచించిన ఆదేశాలను అమలు చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. అదేవిధంగా భారత రాష్ట్ర సమితి పార్టీ కూడా సర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని నిర్ణయించింది. ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. బిజెపి, కాంగ్రెస్ కుట్రలపై జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి అనుకూల ఓటర్లను ఓటర్ల జాబితాల నుండి తొలగించేందుకు ప్రయత్నిస్తే అడ్డుకోవాలన్నారు. ఓటరు జాబితాలో దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు నమోదు కాకుండా నిరంతరము పర్యవేక్షించాలన్నారు. భారత రాష్ట్ర సమితి పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల ఇన్చార్జిలతో హైదరాబాదులో జరిగిన సమావేశంలో కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు పోలింగ్ బూతులలో పార్టీ నియమించే బూత్ లెవెల్ అసిస్టెంట్స్ కీలకంగా వ్యవహరించాలన్నారు. సర్ పై పార్టీ నియ మించిన బూత్ లెవెల్ అసిస్టెంట్స్ అవగాహన కలిగి ఉండాలని పార్టీ అధిష్టానం సూచించింది. ఈ మేరకు బూత్ లెవెల్ అసిస్టెంట్స్ కు పార్టీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా బిజెపి, సిపిఎం, సిపిఐ తదితర రాజకీయ పార్టీలు కూడా సర్ విషయంలో జాగ్రత్త పడాలని నిర్ణయించాయి. తమ పార్టీ శ్రేణుల, సానుభూతిపరుల ఓట్లు తొలగించకుండా నిఘా ఉంచనున్నారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలు, 17 లోక్ సభ నియోజకవర్గాలలో సర్ కార్యక్రమం జూన్ 25న ప్రారంభం కానున్నందున వివిధ రాజకీయ పక్షాల అధిష్టానాలు, నాయకులు, పార్టీ శ్రేణులు దృష్టి సారించారు. ప్రత్యేక కార్యా చరణ రూపొందించి ముందుకు సాగేందుకు సన్నద్ధమవుతున్నారు. అర్హుల ఓట్లను కాపాడుకోకపోతే నష్టము జరిగే ప్రమాదం ఉండడంతో ఇప్పటినుంచే జాగ్రత్త పడుతున్నారు. రాజకీయపక్షాలకు ఈ కార్యక్రమం సవాల్ గా మారింది.

ఆస్తి వివాదం నేపథ్యంలో దారుణ హత్య

డీఎస్పీ రాజశేఖర్ రాజు పరిశీలన

హాలియా, ప్రభాతవార్త,మే 17: అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామంలో ఆస్తి వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొన్న దారుణ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రుద్రాక్ష సుమలత (40), ఆమె కూతురు రుద్రాక్ష లావణ్య (20)లను అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం సుమలతకు చెందిన ఆస్తి విషయంలో సమీప బంధువులతో గత కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం తల్లీకూతుళ్లు తమ ఫామ్ ఆయిల్ తోటలో పనుల కోసం వెళ్లగా, ముందస్తు పథకం మాటు వేసిన నిందితులు వారిపై దాడి చేశారు. కండ్లలో కారం కొట్టి మూన్నీ తో ఇద్దరి గోతు నులిపగా, ఊపిరాడక తల్లి కూతురు లు అక్కడిక్కడే చనిపోయారు. అనంతరం దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. హత్య జరిగిన విషయాన్ని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాగర్ సీఐ శ్రీను నాయక్, హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ ఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. ఘటనపై మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నా మని తెలిపారు. ఆస్తి తగాదాలే హత్యకు కారణమని ప్రాథమికంగా నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. నల్గొండ నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ రంగంలోకి దించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది..

అయిటిపాముల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 17, ప్రభాతవార్త, రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అన్నదాతలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం భరోసా ఇచ్చారు. ఆదివారం వారు మండలంలోని అయిటిపాములలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంయుక్తం గా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియ, తూకం విధానం, లారీల ద్వారా తరలింపు ఏర్పాట్లను వారు నిశితంగా పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు కీలక ఆదేశాలు.... రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయం తో పనిచేయాలని ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని, ధాన్యం తడవకుండా తార్పాలిన్లు, రైతులు కూర్చోవడానికి విశ్రాంతి స్థలాన్ని అందుబాటులో ఉంచాలని, దళారుల ప్రమేయం లేకుండా, కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్టంగూర్ మాజీ జెడ్పిటిసి మాద యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ది సుక్కయ్యగౌడ్, డిపిఎం మోహన్ రెడ్డి, సివిల్ సప్లై డిటి రాచకొండ జ్యోతి, టిపిసిసి నాయకులు నూక కిరణ్ యాదవ్, నకిరేకల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండు పరమేష్ గౌడ్, మాజీ సర్పంచులు బెజవాడ సరోజన సైదులు, గద్దపాటి దానయ్య, కట్టంగూరు ఉప సర్పంచ్ గుండు రాంబాబుగౌడ్, అయిటిపాముల మాజీ ఉప సర్పంచ్ ముత్యాల లింగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మిట్టపల్లి శివశంకర్, ఐతగోని నర్సింహగౌడ్, గోషిక అంజన్ కుమార్, మర్రి రాజ రత్నం, రెడ్డిపల్లి వీరస్వామి, బుచ్చాల వెంకన్నగౌడ్, కొంపెల్లి యాదయ్య గౌడ్, వార్డుసభ్యులు ఐతగోని సైదులుగౌడ్, అనంతుల సైదులు గౌడ్, బొమ్మగాని మహేష్ గౌడ్, ముశం ఉమేష్, మద్దెల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మింగిన నిధులను కక్కేదెవరో...!

మొదటిపేజీ తరువాయి

నిర్వాణ ఏర్పట్లన్నీ పంచాయతీ కార్యదర్శులే...

గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, టెంట్లు, కుర్చీలు, పారిశుద్ధం, వాహనాలు, సిబ్బంది భోజనాలు, రవాణా వంటి ఏర్పాట్ల కోసం భారీగా ఖర్చులు జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు ఆలస్యమవుతాయని చెప్పడంతో పలువురు కార్యదర్శులు స్థానిక వ్యాపారుల వద్ద అప్పులు చేసి ఎన్నికల నిర్వహణ చేపట్టినట్లు సమాచారం. అయితే ఎన్నికలు ముగిసి ఐదు నెలలు దాటినా ఇప్పటివరకు ఆ ఖర్చులకు సంబంధించిన బిల్లులు పూర్తిస్థాయిలో క్లియర్ కాలేదని తెలుస్తోంది.ఇక అసలు వివాదం ఇక్కడే మొదలైందని తెలుస్తోంది. గ్రామస్థాయిలో ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోయినా అన్ని బిల్లులు చెల్లించాం అన్నట్లుగా జిల్లా ఎన్నికల అధికారులకు నివేదికలు పంపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం అప్పులు చేసిన కార్యదర్శులు ఇప్పుడు అప్పుదారుల ఒత్తిడితో పాటు ఆడిట్ భయంతో తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు సమాచారం.

ట్రెజరీ ఖాతాలోకి వెళ్ళని ఇంటి పన్నుల వసూళ్లు...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీల్లో వసూలయ్యే ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు జమ కావాలి. కానీ జిల్లాలోని కొన్ని మండలాల్లో ఇంటి పన్నుల వసూళ్లను ట్రెజరీలో జమ చేయకుండా ఎన్నికల ఖర్చుల కింద చూపించి లెక్కలు సర్దుబాటు చేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రేపు ఆడిట్ వస్తే మేమే బాధ్యత వహించాల్సి వస్తుంద న్నటూ పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కొందరు అధికారుల ఆదేశాలను రాతపూర్వకంగా ఇవ్వాలని కోరినా స్పందన రాలేదని తెలిసింది.

ఎన్నికల నిర్వహణ పేరిట అభివృద్ధి నిధులు దారి మళ్లింపులా!

జిల్లాలోని కొన్ని మండలాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రానికి అదనంగా రూ.2 వేల చొప్పున ఖర్చు చూపించి లక్షల రూపాయలను మండల అభివృద్ధి నిధుల నుంచి మళ్లించారన్న ఆరోపణలు కూడా తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రభుత్వం ఇచ్చిన నిధులు సరిపోలేదంటూ ఉన్నతాధికారులకు అదనపు వ్యయ ప్రతిపాదనలు పంపి అనుమతులు తీసుకున్నట్లు సమాచారం. అయితే ఆ ఖర్చులకు సంబంధించిన బిల్లులు, రశీదులు, సరఫరాదారుల వివరాల్లో అనేక అనుమానాస్పద అంశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల అసలు జరగని పనులకు బిల్లులు సృష్టించడం, ఒకే బిల్లును రెండు పంచాయతీల్లో చూపించడం, స్థానిక వ్యాపారుల పేర్లతో నకిలీ రశీదులు జతచేయడం వంటి అంశాలపై కూడా చర్చ సాగుతోంది. ఎన్నికల నిర్వహణ పేరుతో గ్రామపంచాయతీల ఖాతాల్లో భారీ స్థాయిలో ఆర్థిక అవకతవకలు జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల డిపాజిట్ మొత్తాల వ్యవహారం కూడా వివాదానికి కేంద్రంగా మారింది. నిబంధనల ప్రకారం నిర్దిష్ట శాతం ఓట్లు సాధించిన అభ్యర్థులకు డిపాజిట్ తిరిగి చెల్లించాల్సి ఉండగా, కొన్ని మండలాల్లో ఇప్పటికీ ఆ మొత్తాలు అభ్యర్థులకు అందలేదని సమాచారం. ఫైల్ పెండింగ్లో ఉందని,జిల్లా నుంచి క్లియరెన్స్ రావాల్సిలటూ నెలల తరబడి తిప్పుతున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ డిపాజిట్ సొమ్ములు కూడా ఎన్నికల ఖర్చుల పేరిట మళ్లించబడ్డాయా అన్న అనుమానాలువ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే పలు గ్రామపంచాయతీలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. పారి శుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోవడం, విద్యుత్ బిల్లులు పెండింగ్ పడడం, తాగునీటి మోటార్ల మరమ్మతులు ఆగిపోవడం, వీధి దీపాల నిర్వహణ నిలిచిపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని సర్పంచులు వాపోతున్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు చెల్లించిన పన్నులను ఎన్నికల ఖర్చుల పేరిట మళ్లిస్తే పంచాయతీలు ఎలా నడుస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, ఆడిట్ విభాగం, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం విడుదల చేసిన అసలు నిధులు ఎం? ఖర్చు చేసిన మొత్తం ఎం? ట్రెజరీకి జమ కాని పన్నుల వసూళ్లు ఎం? డిపాజిట్ మొత్తాలు ఎక్కడ నిలిచిపోయాయి? బిల్లుల ఆమోద ప్రక్రియలో ఎవరు పాత్ర పోషించారు? అనే అంశాలపై లోతైన ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే భారీ స్థాయి అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని జిల్లాలో చర్చ సాగుతోంది. ప్రజా ధనాన్ని ఎన్నికల ఖర్చుల పేరిట పక్కదారి పట్టించిన వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుం దన్నది ఇప్పుడు జిల్లాలోఅత్యంత చర్చనీయాంశంగా మారింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

నల్గొండ యువతి మృతి

నార్కెట్ పల్లి ప్రభాతవార్త, మే 17 నల్లగొండ జిల్లా నార్కట్పల్లి మండలం చెరువుగట్టు గ్రామంకు చెందిన గడుసు నవ్య అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఎం.ఎస్ పూర్తి చేసి ఉన్నత ఆశయాలతో ముందుకు సాగుతున్న నవ్య అకాల మరణం ఆమె కుటుంబానికి తీరని లోటుగా మారింది. చెరువుగట్టు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడుసు శశిధర్ రెడ్డి అన్న గడుసు శ్రీనివాస్ రెడ్డి కుమార్తె గడుసు నవ్యా రెడ్డి, పై చదువుల నిమిత్తం అమెరికాలోని రోజ్ వెల్ట్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేయడానికి వెళ్లారు. ఆదివారం చికాగోలో చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందారు. ఈ ఘటనపై స్థానికులు మరియు బంధువులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ నవ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.నవ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు అమెరికాలోని తెలుగు అసోసియేషన్ అఫ్ నార్త్ అమెరికా (తానా) మరియు అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆట) ప్రతినిధులతో చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అధికారులు తెలిపారు. నవ్య మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు స్థానిక సర్పంచ్ నేతగాని కృష్ణయ్య, దేవాలయ చైర్మన్ వారాల రమేష్,నాయకులు రేగట్ట నవీన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఖమ్మంపాటి వెంకటయ్య, మాజీ సర్పంచ్ మల్గా బాలకృష్ణ, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ మనోధైర్యం కలిగించారు.

ప్రజలకు పాదుపు సూచనలు.. ప్రధాని విదేశీ పర్యటనలు

పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలి

తెవ్యకాసం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

చిట్యాల రూరల్, మే 17, ప్రభాతవార్త : ప్రజలు పొదుపు పాటించాలని చెబుతూ, ప్రధాని మోదీ మాత్రం విదేశీ పర్యటనలు కొనసాగిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (తెవ్యకాసం) రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపిందని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల మండలంలోని నేరడ గ్రామం లో తెవ్యకాసంఘం మండల అధ్యక్షుడు కల్లూరు కుమారస్వామి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన తెవ్యకాసం ఎనిమిదో మండల మహా సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా మారుతున్న పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా గ్రామీణ వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి జీవనోపాధి కోసం ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు పోరాడి సాధించుకున్న అనేక హక్కులు, చట్టాలు కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచిందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి, వీబీజీరాంజీగా పేరు మార్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోందని విమర్శించారు. పెరుగుతున్న ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ కారణంగా పేదలకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. వ్యవసాయ కూలీలందరికీ ఉపాధి కల్పించే సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ పంపిణీ, ఉపాధి రక్షణ, పేదల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా పోరాటాలు కొనసాగిస్తా మని పిలుపు నిచ్చారు. ఈసందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ఎర్రటి ఎండలో కష్టపడి పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, వేతన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మెట్టు పరమేష్, అధ్యక్షులుగా కోనేటి రాములు, ఉపాధ్యక్షులుగా ఊడుగు లీలావతి, లడే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరు కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా ఏర్పుల మల్లేశ్వరి, రెడపాక మల్లయ్య, కోశాధికారిగా గోపగోని వెంకన్నతో పాటు పదకొండు మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరికి నియామక పత్రాలను అందజేసి, సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు..ఈ మహాసభలో జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేష్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆరూరి శ్రీనివాస్, తెవ్యకాసంఘం మండల కార్యదర్శి మెట్టు పరమేష్, ఉపాధ్యక్షులు రెడపాక మల్లయ్య, గోపగోని వెంకన్న, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, లీలావతి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీకి పన్నులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

మేడి హరికృష్ణ డిమాండ్

చిట్యాల రూరల్, మే 17, ప్రభాతవార్త : చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులో ఉన్న ఎంపిఎల్ లాజిస్టిక్ హబ్ పరిశ్రమ గ్రామ పంచాయతీకి పన్నులు చెల్లించకుండా, అనుమతులు లేకుండానే కార్య కలాపాలు కొనసాగిస్తోందని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మేడి హరికృష్ణ ఆరోపించారు. గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకో కుండానే కార్యకలాపాలు నిర్వహిస్తోందని, అంతేకాకుండా ఆస్తి పన్ను చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఎంపిఎల్ లాజిస్టిక్ హబ్ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీకి చెల్లించాల్సి న పన్నులను వెంటనే వసూలు చేసి గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

నిస్వార్థ సేవలో పేద ప్రజలకు అండ ఎర్రజెండా

నేరడలో ఘనంగా మేడే వేడుకలు

చిట్యాల రూరల్, మే 17, ప్రభాతవార్త : నిస్వార్థ సేవలో అనునిత్యం పేద ప్రజలకు అండగా నిలిచేది ఎర్రజెండానే అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య అన్నారు. ఆదివారం నేరడ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించిన ప్రదర్శనలో వారు పాల్గొని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన సీపీఎం జెండాలను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఎం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కల్లూరి కుమారస్వామి, కందగట్ల గణేష్, మాజీ సర్పంచ్ వడ్డేపల్లి ఎల్లయ్య, కర్నాటి బిక్షం, చిర్రబోయిన వెంకన్న, ఐతరాజు అంజయ్య, కల్లూరి క్షేత్రయ్య, వడ్డేపల్లి రాజ్ పెంటయ్య, దూడల యాదయ్య, ఐతరాజు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలు-దారుణాలు

ఈదులూరులో వృద్ధురాలు లక్ష్మమ్మ కన్నుమూత

కట్టంగూర్, మే 17, ప్రభాతవార్త,

మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన జాల లక్ష్మమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబంలో వరుస విషాదాలు: మృతురాలు లక్ష్మమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు జన్మించారు. అయితే, ఐదు సంవత్సరాల క్రితం కుమారుడు అనారోగ్యంతో మరణించగా, ఆ తర్వాత కోడలు, మనవడు కూడా మరణించారు. కుటుంబంలో ఒకేసారి ఇంతటి పెద్ద విషాదాలు చోటుచేసుకోవడంతో లక్ష్మమ్మ జీవిత చరమాంకంలో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ముందుకు నడిచిన పెద్ద కుమార్తె.. శాస్త్రోక్తంగా అంత్యక్రియలు... కుమారుడు, మనవడు లేకపోవడంతో లక్ష్మమ్మ పెద్ద కుమార్తె తేళ్ల పద్మ (చిన్న సూరారం గ్రామం) తల్లికి కొడుకై ముందుండి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. శ్మశాన వాటికలో తల్లి చితికి ఆమె తలకొరివి పెట్టి కన్నతల్లి రుణం తీర్చుకున్నారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అయితగోని నారాయణ, కడారి శ్రీనివాసులు, పామన్ గుండ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి జయసుధలతో పాటు లక్ష్మమ్మ ఇతర కుమార్తెలు, అల్లుళ్లు, మనమలు, మనమరాళ్లు, పెద్ద సంఖ్యలో బంధువులు, గ్రామస్తులు పాల్గొని ఆమెకు కన్నీటి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నార్కెట్ పల్లి, ప్రభాతవార్త మే 17

పట్టణంలోని 8వ వార్డులో హైస్కూల్ వెనుక ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సైబర్ నేరాలకు అవగాహనే రక్షణ కవచం

గోవిందరావుపేట ప్రభాతవార్త.సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పస్రా ఎస్సై తాజుద్దీన్ సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సరైన అవగాహన ఉంటే సైబర్ నేరాల బారిన పడే అవకాశం లేదని ఆయన తెలిపారు. సైబర్ నేరాలను ఎదుర్కోవడం చాలా సులభమని ఆయన అభిప్రాయపడ్డారు. మీ సన్నిహితులకు ఎప్పటికప్పుడు సైబర్ మోసాల గురించి చెప్పాలని ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని తెలియని నంబర్ల నుంచి వచ్చే లింక్‌లు క్లిక్ చేయవద్దని,సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం బహిర్గతం చేయడం ప్రమాదమన్నారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.అవగాహన లేకపోవడమే చాలా మంది మోసపోవడానికి కారణమన్నారు.పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై కనీస జ్ఞానం కలిగి అప్రమత్తతే మీ డబ్బు, డేటాకు రక్షణ కవచమని పస్రా మరియు మండలంలో సైబర్ నేరాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను అరికట్టగలమని చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టానికి దారి తీస్తుందని సురక్షితమైన డిజిటల్ జీవనం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై తాజుద్దీన్ పిలుపునిచ్చారు.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి మండుతున్న ఎండలు

నడిగూడెం, మే 17, ప్రభాతవార్త:

ఒకవైపు తీవ్ర ఎండలు మరోవైపు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారం రోజులుగా ఉక్క పోత తీవ్రమైంది. ఎండలు మండిపోతున్నాయి. రానున్న నాలుగైదు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. అత్యంత జాగ్రత్తగా ఉండాలని అవసరమైతేనే బయటికి వెళ్లాలని ఎండలో తిరగవద్దని సూచించారు. దీంతో జనం గృహాలకే పరిమితం అవుతున్నారు. ఇక ఉద్యోగస్తులు కార్యాలయాలకు చేరుకుని సాయంత్రం ఎండ తీవ్రత తగ్గిన తర్వాత ఇంటి ముఖం పడుతున్నారు. క్షేత పర్యటన నిర్వహించాల్సిన అధికారులు ఉదయమే వెళ్లి వస్తున్నారు. ఉదయం 9 గంటలు కాగానే వాహనాలపై ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. గృహాల్లో ఉండాలంటే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంత తీవ్ర స్థాయిలో ఎండలను ఎప్పుడూ చూడలేదు అంటున్నారు. వృద్ధులు అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండ దెబ్బ సోకకుండా జాగ్రత్త పడుతున్నారు. ఏసీలు, కూలర్లు ఎక్కువ సమయం ఉపయోగించక తప్పడం లేదు. దీంతో విద్యుత్ వినియోగం పెరిగింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో వ్యవసాయంగా విద్యుత్ వినియోగం తగ్గిపోయింది. గృహాల విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో అంతగా విద్యుత్ సమస్య లేదు. శీతల పానీయాలకు ప్రజలు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. పశువులు చెట్ల కింద సేద తీర్చుకుంటున్నాయి. ఈనెల 26న కేరళకు రుతుపవనాలు వస్తున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. జూన్ మొదటి వారంలో తెలంగాణకు రుతుపవనాలు ఇచ్చే అవకాశం ఉంది. ఈనెల 25న రోహిణి కార్తె ప్రవేశించనుంది. దీంతో ఎండలు మరింత పెరగనున్నాయి. రోహిణి కార్తెలో రోడ్లు పగిలే ఎండలు ఉంటాయని సామెతలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఉక్కపోతతో రాత్రి వేళల్లో గృహాల్లో పడుకోలేకపోతున్నారు. ఫ్యాను గాలి వేడిగా ఉండడంతో గృహాల ఆరు బయట నిద్రించాల్సి వస్తుంది. ఉపాధి కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్తున్నారు. ఎండ తీవ్రత పెరగకముందే పనులు ముగించుకొని ఇంటి ముఖం పడుతున్నారు. ఎండ దెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్లు, వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. మరో 20 రోజులపాటు ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నడిగూడెం, మే 17, ప్రభాతవార్త:

స్థానిక శ్రీ కొల్లు పాపయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988 89 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చాలా కాలం తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.అంతా ఒకచోట సమావేశం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.చదువు నేర్పిన గురువులు బిక్షం, సీతారామరావు, జగన్మోహన్, యాదగిరిరావు, అనంతరాములు, హాబీబుద్దీన్, పూర్ణచంద్రరావు,లింగారెడ్డి,బాబురావు, విజయలక్ష్మి లను ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించారు.తమ వద్ద చదువు నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగడం, పదిమందికి సహాయపడే పదవుల్లో ఉండడం తమకెంతో ఆనందంగా ఉందని గురువులు అన్నారు. విద్యార్థుల ఎదుగుదల వెనక గురువుల పాత్ర ఎంతగానో ఉంటుందన్నారు. చదువుకొని ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే గుర్తింపు లభిస్తుంది అని అన్నారు. తల్లిదండ్రుల సహకారం గురువుల ప్రోత్సాహంతో జీవితంలో మంచి స్థాయికి ఎదిగామని పూర్వ విద్యార్థులు అన్నారు.తల్లిదండ్రుల గురువుల ఆశయాలను నెరవేర్చామన్నారు.ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి అయిన తమ క్లాస్మేట్ దున్నా శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ గా ఎన్నికైనందుకు సర్పంచ్ దంపతులను పూలమాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుండు విజయరామారావు, శ్రీరాముల నాగేశ్వరరావు, నాగారపు యజ్ఞ నారాయణ,ఆనంద భాస్కర్,మోత్కూరు సత్యనారాయణ, నరసింహారావు,చిలక రమేష్,బీరవల్లి సురేందర్ రెడ్డి,శకుంతల,కొండలమ్మ, మంజు భార్గవి,రాధా, ఉదయమ్మ,బాలాజీ, రాము నాయుడు,దుర్గాచారి,సైదులు,బుస్సా సురేష్, ఇస్మాయిల్, సైదావతి,సాధిక్ అలీ,కోట సత్యనారాయణ, ఉపేందర్,రాధాకృష్ణ, వందనపు రవి,చంద్ర శేఖర్, ముజుబూర్, శ్రీనివాస, గురవయ్య, గురుస్వామి,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజపేటలో సర్పంచుల ప్రత్యేక సమావేశం

రాజాపేట మే 17 ప్రభాతవా

రాజాపేట మండల సర్పంచులు ఆదివారం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. రాజపేట మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది పలు అంశాలపై చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాజపేట మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

మునగాల మే, 17 ప్రభాతవార్త :

ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడానికి సహకారం అందించడం అభినందనీయమని సర్పంచ్ అమర బోయిన మట్టయ్య అన్నారు. మండల పరిధిలోని గణపవరం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణ లైన్స్ క్లబ్ సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రారంభించారు. మానవుల అవయవాల్లో ఎంతో ప్రధానమైన కంటిభాగాలకు ఉచితంగాపరీక్షలు నిర్వహించి కంటిచూపును అందించడానికి కృషి చేస్తున్న లైన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందించడం పేద ప్రజల వరమన్నారు.గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించిందని ఆయన అన్నారు. ఈ శిబిరం లో 126 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 26 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు, కాగా వారిలో ఏడుగురికి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు డాక్టర్ల బంధం తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పలువురు వార్డు సభ్యులు లైన్స్ క్లబ్ వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తా

మునగాల ,మే 17, ప్రభాతవార్త

:గ్రామ అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తానని సర్పంచ్ చల్లా గురవయ్య అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బరాకత్ గూడెం గ్రామం లో ఫ్లైఓవర్ నుంచి రాయినిగూడెం వయా పోలేని గూడెం వెళ్లే దారి

ఇరుకుగా ఇబ్బంది ఉండటం తో గ్రామ ప్రజల ఇబ్బందులు చూడలేక సొంత ఖర్చులతో ముత్యాలమ్మ కట్ట ను బాగు చేయించి ప్రత్యేమాన్య బై పాస్ రోడ్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై భారీ వాహనాలు ఊళ్ళో నుండి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహన దారులు ఇట్టి విషయాన్నీ గమనించి సహకరించాలి అని కోరారు. పదవి లేనప్పుడు కూడా సుమారుగా 500 ట్రిప్పుల మట్టి గ్రామం లోని పొలాలలోకి వెళ్లే దొంకలకి సొంత ఖర్చులతో మట్టి తొలనని, పదవి వచ్చిన సొంత ఖర్చులతో తాత్కాలిక రోడ్డు చేయించానని అన్నారు, నిశ్వార్థంగా పనిచేయడం వాళ్లనే గ్రామ ప్రజలు భారీ మెజారిటీ తో గెలిపించారు అని, వారి ఋణం తీర్చుకోవటానికి రెట్టింపు ఉత్సహం తో పని చేస్తానని అన్నారు. గ్రామ అభివృద్ధే నా లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమం లో వార్డ్ మెంబర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపానికి విరాళం

నడిగూడెం, మే 17, ప్రభాతవార్త:

స్థానిక శ్రీ కోదండ రామస్వామి దేవస్థానానికి అనుసంధానంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి దాతలు ముందుకు వచ్చి ఆదివారం విరాళం ప్రకటించారు. వందనకు సత్యనారాయణ, కళావతి జ్ఞాపకార్థం వారి కుమారులు వందనపు రవి, లలిత దంపతులు వందనపు చంద్రశేఖర్ క్రాంతి దంపతులు రూ.50,116 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. కళ్యాణ మండప నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు భవిరిశెట్టివెంకటరత్నం ,కొండా వెంకటసత్యనారాయణ గుప్త,వందనపు సూర్యప్రకాశరావు, చెన్నూరు వెంకటేశ్వర్లు (బాబు) , వందనపు దయాకర్ ,దివ్వెల శ్రీనివాసరావు ,బుస్సా మహేష్ ,గజ్జి అప్పారావు, వందనపు మోహన్ రావు ,బోనగిరి ఉపేందర్ ,చెన్నూరు లోకేశ్వరరావు , మూర్తి,వందనపు చంద్ర మోహన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురువులకు ఘన సన్మానం

నడిగూడెం, మే 17, ప్రభాతవార్త:

మండలంలోని కాగిత రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 200910 విద్యా సంవత్సరం పదవ తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 15 సంవత్సరాల అనంతరం ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చదివిన రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు జీవితాంతం నిలిచిపోతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకోవాలని నిర్ణయించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆటాపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అనారోగ్యంతో అంగన్‌వాడి ఆయా మృతి

చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త

అనారోగ్యంతో అంగన్‌వాడి ఆయా మృతిచెందిన సంఘటన మండలం లోని కోనాపురం గ్రామంలో నెలకొం ది. గ్రామానికి చెందిన జంగిలి రమ(45)స్థానిక అంగన్‌వాడి కేంద్రం లో ఆయాగా పనిచేస్తుందన్నారు. కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైయివేటు ఆసు పత్రిలో చేర్పించారన్నారు. చికిత్స పొందుతూనే ఆదివారం ఉదయం మృతిచెందిందన్నారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా వీరికి ఒక కుమార్తె ఉందన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు.

.నాగార్జునసాగర్ ప్రభాత వార్త మే 17

నందికొండ మున్సిపాలిటీలో స్థానిక తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం విడుదల చేసిన జీఓ నెం.679 పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం హిల్కా లనీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కాయితి జానకి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు

చేయడం అభినందనీయమన్నారు. జీఓ నెం.679 ద్వారా ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం ముందడుగు వేసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమకారుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కమిటీ ఏర్పాటు దిశగా కృషి చేసిన. ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు.ఓరుగంటి ఆనంద్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమని, త్వరలోనే ఉద్యమకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెలంగాణ ఉద్యమకారులు మాజీ కౌన్సిలర్ హీరే కార్ రమేష్ జి, చంద్రమోళి, ఆదాసు విక్రం,కాటు కృష్ణ, నిర్మల జానీ, మద్దాల భాను, గులాబీ పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం

గుర్రంపోడు,మే 17, ప్రభాత వార్త:

గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆదివారం నల్లగొండ ప్రకాశం బజార్ సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ 14వ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ వైద్య శిబిరానికి కొప్పోలు పరిసర ప్రాంతం నుండి వచ్చిన సుమారు 150 మంది పేషంట్లకు బీపీ,షుగర్,క్రియాటిన్,రక్తపరీక్ష, కిడ్నీ పరీక్ష మొదలగు టెస్టులను ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరంలో సురక్ష మల్టీ స్పెషాలిటీ ఎం.డి వరకాంతం రాజేష్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్ అబ్దుల్ ముహిత్,జనరల్ సర్జన్ వినయ్ కుమార్,ఫిజియోథెరపీ డాక్టర్ సాహితి,మెడికల్ సూపరింటెండెంట్ వరుణ్ కుమార్,దంత వైద్య నిపుణులు కే.శ్వేతా రెడ్డి పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హాస్పిటల్ మేనేజర్ సతీష్ యాదవ్,ఇన్చార్జి ఫయాజ్, నర్సింగ్ స్టాఫ్ ఉపేందర్,రియా, భార్గవి,ఫార్మసీ శివ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కొప్పోలు సర్పంచ్ మారపాక శంకర్,ఉప సర్పంచ్ ఐతపోని వెంకటేశం,నడి కూడ సర్పంచ్ దాసరి ముత్తమ్మ

సైదులు,మెడికల్ రెప్రజెంటేటివ్ పాల్వాయి హరి ప్రసాద్ లను సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కొప్పోలు పరిసర ప్రాంత పేషెంట్లు కొప్పోలు గ్రామంలో సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి వివిధ పరీక్షలు ఉచితంగా చేసి మందులను ఉచితంగా పంపిణీ చేసి వైద్య సేవలను అందజేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థినికి కలెక్టర్ అభినందనలు

నిడమనూరు ప్రభాతవార్త మే 17

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా విజయోత్సవంలో భాగంగా ఆదివారం నల్లగొండలో నిడమనూరు మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థినిపెందోటి భావనకు ఇంటర్మీడియట్లో జిల్లా స్థాయిలో986 మార్కులతోరెండవ ర్యాంకు సాధించినందుకు నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా విద్యాధికారి బిక్షపతిపెందోటి భావనను ఘనంగా సత్కరించి10,000/వేలు రూపాయలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లావూరి వెంకన్న నాయక్, మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బూరుగు నిర్మల, తల్లిదండ్రులు పెందోటి నాగరాజు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అదనపు కార్యదర్శిగా రమేష్

మిర్యాలగూడ, మే 17 ప్రభాతవార్త

ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా మిర్యాలగూడ కి చెందిన కడియం రమేష్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్ గాయత్రి నగర్ వీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్.నెం.2409 రాష్ట్ర మహాసభలో కడియం రమేష్ ను రాష్ట్ర కమిటీ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. గతములో ఎస్సీ /ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నల్లగొండ రీజియన్ కార్యదర్శిగా చేసిన సేవలు గుర్తించి రాష్ట్ర కమిటీలో అదనపు ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించి నట్లు పేర్కొన్నారు.

కుమ్మరులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలి

తుర్కపల్లి, మే 17 ప్రభాతవార్త

కుమ్మరులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్ రావు అన్నారు.ఆదివారం తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర 33 జిల్లాల కుమ్మర సంఘం సమావేశాన్ని హైదరాబాద్లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ క్లబ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుర్కపల్లి మండలానికి చెందిన కుమ్మర సంఘం నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కుమ్మర్లు అన్ని విధాలుగా అభివృద్ధి రంగంలో ముందుకు రావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జనాభా లెక్కలో కుమ్మర్లను తక్కువ చూపించడం అన్యాయమని అన్నారు.కుమ్మర్ల అభివృద్ధికి కావలసినది ఫెడరేషన్ కాదని అన్నారు కుమ్మర కులానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని, మానవమనగడకు నాగరికతను నేర్పిన కుమ్మర్లను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల అధ్యక్షుడు దేవరుప్పల ఐలయ్య, మండల ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, కోశాధికారి జాగిల్లపురం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండల్ పాల్గొన్నారు

మారథాన్ కార్యక్రమంలో పాల్గొనండి

నర్మెట, మే 17 ప్రభాతవార్త :

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 18న(సోమవారం) నర్మెట మండలకేంద్రంలో తలపెట్టిన మారథాన్ కార్యక్రమంలో మండల అధికారులు యువత ప్రజాప్రతినిధులు మహిళా సంఘాలు నాయకులు పాల్గొనాలని ఎంపీడీవో కావ్య శ్రీనివాస్ కోరారు. యువత క్రీడలు పర్యాటక వారసత్వ సంస్కృతిలో భాగంగా ఉదయం ఏడున్నర గంటలకు ఎంపీడీవో కార్యాలయం నుండి మారథాన్ కార్యక్రమం నిర్వహింపబడుతుందని అందరూ తప్పకహాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

నాగార్జున సాగర్ వార్త

యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు కృషి చేయాలి

త్రిపురారం,మే 17. ప్రభాతవార్త:.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా యువతలో క్రీడా స్ఫూర్తితో పాటు నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు చేపట్టే స్పోర్ట్స్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కున్ రెడ్డి విజయ కుమారి అన్నారు. ఆదివారం ఆమె స్థానికంగా మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా యువజ న క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18 నుండి 23 వరకు ప్రజా ప్రతినిధులు, ప్రజాభాగ స్వా మ్యంతో నిర్వహించనున్న స్పోర్ట్స్ వీక్ కార్యక్రమంలో చేపట్టనున్న రోజు వారి కార్యక్రమాలపై ఆమె వివరించారు. అందులో భాగంగా ఈనెల 18న ఉదయం 6 గంటలకు యోగ, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు ఏడు గంటలకు రెండు కిలోమీటర్ల నడక కార్యక్రమాన్ని నిర్వహించనున్నందున స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు క్రీడాకారులు, క్రీడా అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

హాలియాలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం

హాలియా, ప్రభాతవార్త, మే 17:

హాలియా పట్టణంలోని ఆదిత్య కేర్ హాస్పిటల్‌లో నల్గొండ రివర్ హాస్పిటల్, స్థానిక ఆదిత్య కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ నులక రవీందర్ రెడ్డి, డాక్టర్ సమత తూప్రాన్ ల ఆధ్వర్యంలో సుమారు 100 మంది రోగులను పరీక్షించారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా క్రియాటిన్, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. కిడ్నీ సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తిస్తే ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెన్ను వీరారెడ్డి, చెన్ను నర్సిరెడ్డి, రిక్కల ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.

సి ఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

మిర్యాలగూడ, మే 17 ప్రభాతవార్త

దామరచర్ల మండల కేంద్రం లో ఆదివారం అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇటీవల గుంజ రేణుక, నారాయణకు తెలంగాణ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించిన సందర్భంగా ఘనంగా సంబరాలు నిర్వహించారు. రేణుక పుట్టిల్లు దామరచర్ల కావడం గమనార్హం. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా అధ్యక్షుడు వేముల సుధాకర్ మాట్లాడుతూ బీసీ, బడుగు బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పాలనలో దూసుకుపోతున్నారన్నారు. వడ్డెర సమాజ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. అనంతరం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఓర్సు బిక్షమయ్య, యువ నాయకులు, సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన దొంగ

కొండమల్లేపల్లి,మే17,ప్రభాతవార్త:

తాళం వేసిన ఇళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగని కొండమల్లేపల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు.డిఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.కొండమల్లేపల్లి గ్రామానికి చెందిన శ్రీ కర్రె ఆనందర్ అనే ఉపాధ్యాయుడు ఏప్రిల్ నెల 9న చెన్నైలో పని ఉన్నందున తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి చెన్నైకి వెళ్లారు.కాగా ఏప్రిల్ 13న వారు ఇంటికి రాగా ఇంట్లో దొంగలు పడి బీరువాలో ఉన్న 75 వేల రూపాయలు దొంగిలించినట్టు గుర్తించారు.ఈ విషయంపై స్థానిక పిఎస్‌లో ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆదివారం కొండమల్లేపల్లి పోలీసులు పెళ్లిపాకల ఎక్స్‌రోడ్డువద్ద ఎస్ఐ అజ్మీర రమేష్ తన

సిబ్బందితో కలిసి వాహనాల తనిఖిలు నిర్వహిస్తుండగా ఒక బైకుపై వెళుతున్న వ్యక్తిని ఆపి బైక్‌కు సంబంధించిన పేపర్లు అడగగా అతడు పేపర్లు చూపించకపోవడంతో అతనిపై అనుమానం కలిగి ప్రశ్నించగా,ఆ వ్యక్తి పారిపోతుండడంతో పోలీసులు చాకచక్యంతో పట్టుకున్నారు.అనంతరంఆ వ్యక్తిని పోలీసులు విచారించగా అతని పేరు దాసరి విజయ్ అలియాస్‌మాస్ విజయ్ అలియాస్ నాని అలియాస్ చరణ్ వయసు 36 సంవత్సరాలు,ఆటో డ్రైవర్ వృత్తి నిర్వహిస్తూ,,,ఏ రామ్‌రెడ్డిపేట,పల్నాడు జిల్లా ఆంధ్రప్రదేశ్,ఎన్/ఏ పొన్నారం గ్రామం మంచిర్యాల జిల్లా తెలంగాణ రాష్ట్రంగా గుర్తించారు.ఈ వ్యక్తి నుండి 12తులాల బంగారం,90 వేల నగదు,ఒక ద్విచక్ర వాహనం స్వాధీన పరుచుకున్నట్టు పోలీసులు తెలిపారు.తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న దొంగను చాకచక్యంగా పట్టుకున్న కొండమల్లేపల్లి సిఐ ఏ.నవీన్ కుమార్,ఎస్ఐ రమేష్,పోలీసులు వి.హేము నాయక్,జి భాస్కర్,కృష్ణారెడ్డి,పిసి నవీన్ కుమార్,శేఖర్ రెడ్డిలను డి.ఎస్.పి శ్రీనివాసరావు అభినందించి రివార్డులు అందజేసినట్లు తెలిపారు.

మజ్జిగ పంపిణీ చేసిన ట్రాన్స్‌జెండర్స్

కొండమల్లేపల్లి,మే17,ప్రభాతవార్త:

మీ సేవలో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ట్రాన్స్ జెండర్స్ కొండమల్లేపల్లి పట్టణంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి పెరుగును అందించారు.ఆదివారం కొండమల్లేపల్లి ట్రాన్స్ జెండర్స్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 120 కేజీల పెరుగును వితరణగా ఇచ్చి మజ్జిగ పంపిణీ చేశారు.మీ సేవలో మేము సహితం అంటూ కొండమల్లేపల్లి ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలకుమజ్జిగ పంపిణీ చేశారు.వేసవిలో అల్లాడుతున్న ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు వారిని అభినందించారు.ఆదివారం కావడంతో 2500 మందికి మజ్జిగ పంపిణీ

చేశారు.ఆర్థికంగా పరిపుష్టితో ఉన్న ఎంతోమంది పది రూపాయలు దానం చేయని ఈ రోజుల్లో ట్రాన్స్‌జెండర్స్ ముందుకు వచ్చి సొంత ఖర్చులతో మజ్జిగ పంపిణీ చేయడం మెచ్చుకోదగ్గ విషయం అని పలువురు అన్నారు.వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమం లో పాల్గొనాలని సూచించారు.ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ కొండమల్లేపల్లి లాస్య,జయలను ఘనంగా సన్మానించారు.ఇలాంటి సేవలలో మునుముందు ఇంకా పాల్గొంటామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము,కూన భానుచందర్,సైదులు,అలంపల్లి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

కొండమల్లేపల్లి,మే17,ప్రభాతవార్త:

విద్యుత్‌ఘాతంతో మృతి చెందినవానరానికి హిందూ సంప్రదాయ పద్ధతిలో స్థానిక యువకులు అంత్యక్రియలు నిర్వహించారు.కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాదు రోడ్డులో వానరం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది.అటువైపుగా వెళ్లిన యువకులు వానరం మృతి చెందిన విషయాన్ని గమనించారు.ఈ సందర్భంగా పలువురు యువకులు అక్కడికి చేరుకున్నారు.హిందువులు వానరాన్ని ఆంజనేయ స్వామి రూపంగా కొలుస్తారు. అలాంటి వానరం మృతి చెందడంతో

కలత చెంది బాధపడ్డారు.అనంతరం హిందూ సంప్రదాయ పద్ధతిలో వానర మృతదేహానికి కుంకుమ పెట్టి పూలదండలు వేసి పూజ్చారు.అనంతరం కాషాయ కండువా కప్పి,కాషాయ జెండా ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.వానరం చనిపోవడం బాధాకరమని,తమ చేతుల మీదుగా వానర మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గురు స్వామి భూతరాజు దాసు,కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏరుకొండ రాము, కొండమల్లేపల్లి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు భూతరాజు భరత్ కుమార్, నెల్లికంటి గోపి,శివ గౌడ్,సాయి, వెంకటేశ్వర్లు, ఉదయ్,అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాల ప్రారంభోత్స వానికి రండి

సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానాన్ని పలికిన ఎమ్మెల్యే ఐలయ్య

యాదగిరిగుట్ట మే 18, (ప్రభాత వార్త)

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నందు ప్రతిష్టాత్మకముగా నిర్మింపబడు వేద పాఠశాలకు ఈనెల 23 వ తేదీ రోజున దేవస్థానం నందు టెంపుల్ సిటీ ప్రాంగణంలో శ్రీ కంచి పీఠాధిపతి చే నిర్వహింప బడు భూమి పూజకు సీఎం రేవంత్ రెడ్డికి దేవాదాయ ధర్మాదాయ శాఖ కొండ సురేఖకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దేవస్థానం ఈవో భవాని శంకర్, ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, శివాలయ ప్రధాన అర్చకులు నరసింహమూర్తిలు కలిసి

ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో తో పాటు భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డ దేవదాయ శాఖ, దేవస్థానం తరపున ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ వి హనుమంతరావు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి కి శ్రీ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందజేయడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో దేవస్థాన వేద పండితులు పాల్గొన్నారు

మునుగోడు వార్త

బసంతాపురం సెంటర్లో దళారుల ధాన్యం?...

నేడు కేంద్రాన్ని సందర్శించనున్న జిల్లా అధికారులు.

అప్పటికే ఒక లోడ్ ధాన్యం మిల్లుకు సరఫరా!..

రాజాపేట, మే 17 ప్రభాతవా

రాజాపేట మండలం బసంతాపురం సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం లో దళారుల ధాన్యం చేరినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఒక లోడు ధాన్యము మిల్లుకు సరఫరా అయినట్లు చెబుతున్నారు. కాగా ఈ విషయం మండల జిల్లా అధికారులకు సమాచారం అందడంతో సోమవారం బసంతాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తగు చర్యలు తీసుకొని ఉన్నట్లు ఏపీఎం మురారి చెబుతున్నారు. ఆదివారం విలేకరులకు ఆయన వివరాలు చెబుతూ దళారుల ధాన్యం బసంతాపురం కొనుగోలు కేంద్రంలో రైతులకు సంబంధించిన ధాన్యం కాకుండా వేరే కుప్పలు ఉన్నాయని ఫిర్యాదు వచ్చినట్లు చెప్పారు. ఈ విషయంపై రాజపేట మండలంలోని కాకుండా జిల్లా స్థాయిలో తీవ్రత చర్చ నెలకొంది. గత ఏడాది దూది వెంకటాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారుల ధాన్యం పై జరిగిన రగడ తెలిసినప్పటికీ ప్రస్తుత ఏపీఎం నిర్వహిస్తున్న మహిళా సంఘాలు నిర్లక్ష్యం వహించడంపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. నెల రోజులైనా 30 శాతం ధాన్యం తరలింపు : రాజపేట మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్న కేవలం 30 శాతం ధాన్యం మాత్రమే మిల్లులకు తరలింపు జరిగింది. అంతకుముందు జిల్లా మండల స్థాయి అధికారుల నివేదిక ప్రకారం సుమారు ఐదు లక్షల బస్తాల ధాన్యం రాజపేట మండలంలో రైతుల నుండి కొనుగోలు చేయాల్సి వస్తుందని లెక్కలు చెబుతుండగా, ఇప్పటివరకు 1,52,284 బస్తాలు రైస్ మిల్ కు తరలించారు. మొత్తం 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 14 ఐకెపి ద్వారా మిగిలిన 6 మహిళా సంఘాల ద్వారా కొనసాగుతున్నాయి. మహిళా సంఘాల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ తరలింపుమర్నిత నత్తనడక సాగుతున్నాయి. మొత్తం 2,27,397 బస్తాల ధాన్యం సేకరణ జరగగా కొనుగోలు కేంద్రాలలో 77,653 బస్తాలు తరలింపుకు సిద్ధంగా ఉన్నాయి. అంతేకాకుండా మరో రెండున్నర లక్షల ధాన్యం బస్తాల రాశులు 20 కేంద్రాలలో ఉన్నట్లు అంచనా. 14 ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు 1,77,397 ధాన్యం బస్తాలు సేకరణ జరగగా 1,38,84 బస్తాలు రైస్ మిల్లుకు తరలింపు అయ్యాయి మిగిలిన 39053 ధాన్యం బస్తాలు కేంద్రాలలో నిల్వ ఉన్నాయి. మహిళా సంఘాల ద్వారా కొనసాగుతున్న ఆరు కేంద్రాలలో 52 ధాన్యం బస్తాలు సేకరణ జరగగా 13,400 బస్తాలు తరలింపు జరగగా 38,600 బస్తాలు కేంద్రాలలో నిల్వ ఉన్నట్లు ఏపీఎం చెప్పారు. మరో 40 వేల బస్తాలకు పైగా ధాన్యం కుప్పలు ఉన్నట్లు ఆయన తెలిపారు. నెల రోజుల్లో కేవలం 30 శాతం ధాన్యం మాత్రమే రైస్ మిల్లులకు తరలింపు జరగగా మరో 70 ధాన్యం బస్తాలు ధాన్యం రాశులు కేంద్రాలలో ఉన్నాయి. ఈ విషయంపై రైతులు ఆందోళన చెందుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నత్త నడకన ధాన్యం కొనుగోలు సాగుతున్నట్లు విమర్శిస్తున్నారు. అకాల వర్షాల వల్ల తమ ధాన్యం కు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం రాత్రి నెలకొంది. చెన్నారావుపేట గ్రామానికి చెందిన వరగంటి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఖాదర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కుల గణన సర్వేలో భాగంగా ఖాదర్‌పేటలో సర్వే చేసి రాత్రి ఇంటికి వెళుతున్నాడన్నారు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం డీకొట్టిందన్నారు. దీంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారన్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన

చెరువుగట్టుకు పోటెత్తిన భక్తులు

నార్కెట్ పల్లి ప్రభాతవార్త మే 17 దక్షిణ కాశీగా,తెలంగాణ శ్రీశైలం గా,భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నటువంటి నల్లగొండ జిల్లా నార్కెట్పల్లి మండలం చెరువుగట్టు శ్రీశ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవ స్థానంలో అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన ఉత్సవాలు ఘనంగా నిర్వహింప బడింది. ప్రతినెల అమావాస్య రోజు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అభిషేకము,సాయంకాలలం స్వామివారి సన్నిధిలో లక్ష పుష్పార్చన నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం. భక్తులు అమావాస్య రోజున స్వామివారిని దర్శించుకుంటే మానసిక,శారీరక రుగ్మతలు తొలగిపోతాయని నమ్మి, అనేక వ్యాయ ప్రయాసలతో క్షేత్రానికి చేరుకుని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.శనివారం పైగా వేసవి సెలవులు కావడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర ప్రాంతాలనుండి కూడా భక్తులు అమావాస్య రోజు స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి క్షేత్రానికి పోటెత్తారు. అమావాస్య పూజా కార్యక్రమాలలో భాగంగా ఉదయం ప్రాతఃకాలం ప్రభాత నిజరూప అభిషేకం అనంతరం ఆలయ మహా మండపంలో సామూహిక అభిషేకం ఘనంగా నిర్వహించారు. సాయం కాలం ప్రధానాలయంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు మంగళ వాయిద్యాలు,భక్తుల శివనామ స్మరణ మధ్య ఆలయ మహా మండపానికి చేర్చి ఆలయ ప్రధానార్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, అర్చక బృందం వేదమంత్రోచరణ మధ్య పుష్పార్చన పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. పూజ అనంతరం భక్త బృంద ఆధ్వర్యంలో శివనామస్మరణ, భజనలు నిర్వహించారు. నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాత నిర్వ హించిన లక్ష పుష్పార్చన కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు అందరితో మహా మండపం కళకళలాడింది. కార్యక్రమం లో ఆలయ చైర్మన్ వారాల రమేష్, కార్యనిర్వహణ అధికారి సల్వది మోహన్ బాబు, ధర్మకర్తలు, సిబ్బంది, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

బి. వెల్లంలలో ఉచిత టిబి శిబిరం విజయవంతం

నార్కట్పల్లి ప్రభాతవార్త మే 17 బి. వెల్లంల గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత టిబి (క్షయ వ్యాధి) నిర్ధారణ శిబిరం విజయవంతంగా ముగిసింది. గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుండి మంచి స్పందన లభించింది. సర్పంచ్ చిరుమర్తి ధర్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఉచిత డిజిటల్ ఎక్స్రే పరీక్షలు నిర్వహించారు. గ్రామాన్ని టిబి రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్లబోతు సత్తయ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ అశ్విని, టీబీ నోడల్ ఆఫీసర్ అజయ్, సైదులు, ఏఎన్ఎంలు శ్రీనమ్మ, స్వరూపారాణి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస చారి, ఆశా వర్కర్లు చిరుమర్తి భాగ్య, దర్శ రాజేశ్వరి, గుత్త సరిత, చెరుకుపల్లి సరిత మరియు గ్రామ ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడమే టియుడబ్ల్యూజే లక్ష్యం

నార్కెట్ పల్లి మండలంలో ముమ్మరంగా సభ్యత్వ నమోదు

నార్కెట్ పల్లి ప్రభాతవార్త,మే 17 జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడమే టియుడబ్ల్యూజే (ఐజేయు) లక్ష్యమని ఆ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నార్కట్పల్లి లో జరిగిన టి యు డబ్ల్యు జే సభ్యత్వ నమోదు కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ తో పాటు, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం తోపాటు హెల్త్ కార్డులను అందించడానికి యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి జర్నలిస్టుకు యూనియన్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. త్వరలో జరిగే యూనియన్ జిల్లా మహాసభకు జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమామిడి మహేంద ర్ రెడ్డి, యేళ్ల భయన్న,దేవరశెట్టి నారాయణ, బాశెట్టి శ్రీనివాస్, పసునూరి చంద్రశేఖర్, ప్రజ్ఞాపురం శివశంకర్, ప్రజాపురం కృష్ణ, బండారు రాంబాబు, తిరుమల్ , రా ధారపు రమేష్, సోమ వెంకటరెడ్డి, మంద చంటి, గర్దాస్ వెంకటేశ్వర్లు,సిరిశెట్టి సంతోష్ టీయూడబ్ల్యూజే సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వరి కోయలను కాల్చవద్దు

రైతులకు వ్యవసాయ అధికారి వై. గిరిప్రసాద్ హెచ్చరిక

కట్టంగూర్, ప్రభాతవార్త,మే 17, వరి కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే కోయలను తగలబెట్టడం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కట్టంగూర్ మండల వ్యవసాయ అధికారి ఎడవల్లి గిరిప్రసాద్ హెచ్చరించారు. రైతులు సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి, ఆధునిక పద్ధతుల ద్వారా పంట వ్యర్థాలను మేనేజ్ చేయాలని ఆయన సూచించారు. కోయలను కాల్చడం వల్ల కలిగే నష్టాలను ఆయన వివరించారు. కోయలను కాల్చడం వల్ల నేలలోని విలువైన సేంద్రీయ పదార్థాలు, పోషకాలు పూర్తిగా నశిస్తాయని, రైతుకు మేలు చేసే వానపాములు, నేలలోని సూక్ష్మజీవులు మంటల వల్ల చనిపోతాయని, వెలువడే దట్టమైన పొగ వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు, తీవ్రమైన దగ్గు, కంటి మంటలు, ఊపిరి తిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్బన్ ఉద్గారాలు పెరిగి వాతావరణ మార్పులకు దారి తీస్తుందని, భూమి గట్టిపడి నీటిని నిల్వ ఉంచుకునే సామర్థం తగ్గు తుందన్నారు. పొలంలో గాలి ప్రసరణ, నీటి చొరబాటు తగ్గి తదుపరి వేసే పంట దిగుబడి గణనీయంగా పడిపోతుందని రైతులకు సూచించారు. రైతులు వరి కోయలను కాల్చకుండా పొలంలోనే ఉంచి కుళ్ళింపజేయాలని వ్యవసాయ అధికారి వివరించారు. అందు కోసం స్ట్రా చాపర్ లేదా శ్రెడర్ యంత్రాల సహాయంతో పంట అవశేషాలను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించాలని, అనంతరం పొలంలో నీరు పెట్టి, ట్రాక్టర్ రోటావేటర్‌తో 25 రోజుల వ్యవధిలో రెండుసార్లు దమ్ము చేయాలని, ఇలా చేయడం వల్ల వరి కాడలు త్వరగా కుళ్ళిపోయి, నేలకు అవసరమైన సేంద్రియ కార్బన్ అందుతుందని గిరిప్రసాద్ తెలిపారు. దీనివల్ల తర్వాతి పంటలో వరి నాణ్యత మెరుగవడమే కాకుండా, భూమి సారవంతంగా మారుతుందని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

పరమేశంకు నివాళులు అర్పించిన లింగయ్య

నార్కెట్ పల్లి ప్రభాతవార్త మే 17 మండలంలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామ మాజీ సర్పంచ్ చెరుపల్లి పరమేశం అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఆదివారం నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే వీరేశం చిత్రపటాలకు పాలభిషేకం

చిట్యాల, మే 17, ప్రభాతవార్త

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తుండటం అభినంద నీయమన్నారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, గృహ పథకాలు, విద్యా మరియు వైద్య సదుపాయాలలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక కోటా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారులు జోగు లింగస్వామి, కొసనం అశోక్ యాదవ్, చికిలంమెట్ల మెహర్ బాబు, బాస్పాజు రామాచారి, అమరోజు వెంకన్న, జిల్లాపల్లి స్వామి, జోగు మల్లేష్ తదితరులు ఉన్నారు.

రైతులు వరి కోయలు తగలబెట్టడం ఆపాలి

చిట్యాల, మే 17, ప్రభాతవార్త

వరి కోత కోసే యంత్రాలు సగం ఎత్తువరకు మాత్రమే గడ్డిని కొస్తాయి, పొలంలో మిగిలిన గడ్డి దున్నే సమయంలో అడ్డుగా ఉన్న వారి కొయ్య లను తగలబెట్టడం ద్వారా పర్యావరణ కాలుష్యంతో పాటు, మట్టికి కూడా నష్టం కలుగుతుందనీ, వారి కొయ్య లను తగల బెట్టడం నేరమని మండల వ్యవసాయ అధికారి గిరిబాబు అన్నారు. పొలంలో మిగిలిన వరి గడ్డిని మరియు కొయ్యలను తగలబెట్టడం ద్వారా, ముందుగా మట్టిలోని తేమ మొత్తం ఆవిరైపోతుందనీ, అంతేకాకుండా పంటకు మేలు చేసే ఎన్నో జీవరాసులు కూడా నశిస్తాయి తెలిపారు. కొయ్యలను కాల్చడం వలన మట్టి గట్టిపడుతుంది దీనివలన మట్టిని దున్నడం కష్టమవుతుందనీ, పంట అవశేషాలు కాల్చినప్పుడు ఉత్పన్నమయ్యే పొగ మరియు బూడిద వలన వాతావరణ కాలుష్యం పెరుగుతుందనీ తెలిపారు. కావున రైతులు కోరికలను కాల్చడం ఆపేయాలని ఆయన కోరారు.

కార్యకర్తకు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కట్టంగూర్, మే 17, ప్రభాతవార్త, మండలంలోని పామనగుండ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువనాయకులు బండారు గణేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ముఖ్య అతిథిగా హాజరై, బండారు గణేష్‌తో కేక్ కట్ చేయించి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. యువ నాయకత్వంతోనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కట్టంగూర్ మాజీ జడ్పీటీసీ తరాల బలరామ్, పామనగుండ్ల గ్రామ మాజీ సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి, మండల ఆప్షన్ మాజీ సభ్యులు షేక్ జానీ పాషా, వడ్డే ఏసు సైదిరెడ్డి , పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గణేష్‌కు శుభాకాంక్షలు అందజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఏపిఎం విజయలక్ష్మీ

దేవరకొండ, మే 17, ప్రభాత వార్త : గ్రామీణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా స్థిరపడి, స్వయం ఉపాధితో అభివృద్ధి చెందడమే ముఖ్య లక్ష్యం అని మండల సమాఖ్య ఏపిఎం విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం సీనియర్ సిఆర్పిలు దేవరకొండ పట్టణంలో ఉన్న మహిళ సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు, వివో ఏ లకు నిర్వహించిన ప్రత్యేక సమావేశం లో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామ సంఘాలు ప్రతినెల క్రమం తప్ప కుండా సమావేశాలు నిర్వహించుకొని, ఆర్థికపరమైన లావాదేవీలను పక్కాగా సమీక్షించుకోవడంపై మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. గ్రామ సంఘాలు ఆర్థికంగా మరింత స్వయం సమృద్ధి మహిళ సంఘాల బలోపేతమే లక్ష్యం సాధించేలా సూచనలు చేశారు. క్రమం తప్పకుండా పొదుపులు చేసుకొని అంతర్గత రుణాలు తీసుకోవచ్చని, అలాగే బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి ద్వారా కూడా రుణాలు పొందవచ్చని వివరించారు. ప్రతి మహిళ తమ కుటుంబ అవసరాలకు, వ్యాపారాలకు సరిపడేలా ప్రణాళికలు

తయారు చేసుకొని వాటి ద్వారా అదనపు ఆదాయం పొందేందుకు కృషి చేయా లన్నారు. వివిధ వ్యాపారాలపై మహిళలకు శిక్షణ ఇప్పించి ఉత్పత్తి చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకొని ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. వృద్ధుల సంఘాలు, కిషోర్ బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందు తాయని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సిఆర్పిలు జి. స్వరూప, బి. పూలమ్మ, గ్రామ సంఘాల అధ్యక్షురాలు, సీసీలు, వివో ఏ లు ఉన్నారు.

ఎప్ సెట్ ఫలితాలలో ప్రగతి కళాశాల ప్రభంజనం

నల్లగొండ, మే 17, ప్రభాతవార్త:

ఆదివారం ప్రకటించిన ఎప్ సెట్ 2026 ఫలితాలలో నల్గొండ పట్టణం లోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి నల్గొండ జిల్లాలో మరి ఏ కళాశాల సాధించలేని విధంగా ర్యాంకులు సాధించి జిల్లా చరిత్రను తిరగరాశారు. కళాశాలకు చెందిన తేజ్ వీర్ 1203 ర్యాంకును సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే విధంగా భవాని 1818, శ్రీవల్లి 3150, భువిశ్రీ 3361, సుహాస్ 3469, సాత్విక్ 3611, మనీదీప్ 3693, శివ 3756, అక్షిత 4221,వెన్నెల 4487, అనన్య 4494, రంజిత 4614, గీతాంజలి 4791, భాను కృతిక 5764, శ్రీ సాయి తులసి 6103, వన్షిత 6229, అభిషేక్ 6767, తంజిల్లా ఫిర్ దోస్ 6884, తేజస్విని 6931, ప్రియదర్శిని 8768, స్నేహా రెడ్డి 8983, మానస 9476, అక్షర 9893, శ్రీజ 9933 వరకు ర్యాంకులు సాధించి ప్రగతి జూనియర్ కళాశాలను జిల్లాలో అగ్రగామి కళాశాలగా నిలిపారు. 15 వేల లోపు ర్యాంకులు మొత్తం 40

మంది విద్యార్థులు సాధించి ప్రగతి జూనియర్ కళాశాలను జిల్లాలో అగ్రగామి కళాశాలగా నిలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను వారి తల్లిదండ్రులను అందుకు సహకరించిన అధ్యాపక బృందానికి కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, మరియు డైరెక్టర్లు ఎ. నరేందర్ బాబు, ఎన్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్ , పైళ్ల రమేష్‌రెడ్డి అభినందనలు తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికబద్ధమైన విద్యాబోధన, అంకితభావం కలిగిన యాజమాన్యం మరియు అధ్యాపకబృందం కృషివలన ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

ప్రభుత్వ బడుల విద్యార్థులు సత్తా చాటుతున్నారు

ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యార్థులకు ఘన సన్మానం

చిట్యాల రూరల్, మే 17, ప్రభాతవార్త : ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఫలితంగానే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నేడు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ సత్తా చాటు తున్నారని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ అన్నారు. జిల్లాలో ప్రభుత్వ బడుల విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు – విద్య విజయోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నల్లగొండలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలో 577 మార్కులు సాధించి పదో తరగతి ఫలితాలలో ద్వితీయ స్థానంలో నిలిచిన మండలంలోని చిన్నకాపర్తి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని హెచ్చు శ్రీవిద్యను శాలువాతో ఘనంగా సన్మానించి రూ.10 వేల నగదు ప్రోత్సాహకం అందజేసి అభినందించారు. అదేవిధంగా త్రిపుర రాష్ట్రంలోని అగర్తలలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి యోగ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు బొల్లం నితీష్ కుమార్, రొండి శరత్ లను శాలువాలతో ఘనంగా సన్మానించి, చెరో రూ.5 వేల నగదు పురస్కారం అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్యాబోధనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై మరింత శ్రద్ధ పెంచే దిశగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం అల్పాహార పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచడం గర్వకారణమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి పానుగోత్ సైదానాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే మరిన్ని విజయాలు సాధించగలరన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ఫలితాలు సాధ్యమైనట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో తల్లిదండ్రులు హెచ్చు నర్సింహా, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

నార్కట్‌పల్లి ప్రభాతవార్త, మే 17 నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంల గ్రామంలోని ప్రభుత్వ దవాఖాన పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న నేపథ్యంలో, భద్రతా చర్యగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆస్పత్రి పరిసరాలలో అసాంఘిక గారి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆసుపత్రి సిబ్బంది ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ కందకట్ల రజనీ యాదవరెడ్డి మరియు ఉప సర్పంచ్ పైళ్ళ శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, వారు వెంటనే స్పందించారు. ఈ క్రమంలో ఎర్ర వెంకట రెడ్డి సహకారంతో దవాఖాన ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరియు

ఉప సర్పంచ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ముందస్తు చర్యగా ఈ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామ నరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు సామ మహేశ్వరి, శాంతిరెడ్డి, గడ్డపాటి శంకర్, ముప్పిడి పద్మ, సైదులు, జాల శంకర్ ప్రసాద్, పంగ పార్వతమ్మ, రమేష్, ఉడుగు చిరంజీవి, వెలెంల కృష్ణవేణి, లింగారెడ్డి, అల్లుగుబెల్లి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ వార్త

ఎప్ సెట్ ఫలితాలలో గౌతమి ప్రభంజనం

నల్లగొండ, మే 17, ప్రభాతవార్త :

ఆదివారం ప్రకటించిన తెలంగాణ ఎప్ సెట్ ఫలితాలలో గౌతమి

జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి సత్తావాటి చరిత్ర సృష్టించారు. ఇంజనీరింగ్ విభాగంలో సాత్విక్ రెడ్డి 873, సోమేశ్వరి 929, వైష్ణవి 954,మలిహా తస్నీమ్ 1361,సౌమ్య 2026, అనుగ్న శ్రీయాం 2643, మధు ప్రియ 3267, తితిక్ష 3280,హిబా మైరుక్ 3292, మధిహ తస్నీమ్ 3663,బుష్రా 4424, శివ 5916, సింధుజ 6163, అజీజూర్ రహమాన్ 7339, నీరజ్ నారాయణ 9267, శ్రావ్య 9384, అయాన్. యండి 9620, లహరిక 10781, హేమ చందర్ 10795, ఆశిత 11271, సాయి ప్రణీత్ రెడ్డి 11970, శ్రీహాన్ సంతోష్ రెడ్డి 13042, తేజిత 13289, మేఘన 13345, భానుమతి 14459, అను 14565, అమూల్య 14745, సాయి హర్ష 15300, నాగ సంజన 15502, రాకేష్ 17428, లహరి 17706, తేజస్విని 17944, సిరి 18623, అఫియా నాజ్ 18838, శివ దీక్షిత 19000, సుష్మ 19118, యోగితా రాజ్ 19256 ర్యాంకులు సాధించారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం, కాసర్ల వెంకట్ రెడ్డి, చల్లా వెంకట రమణ, కొమ్మిడి రఘుపాల్ రెడ్డి, పుట్టా వెంకట రమణా రెడ్డి లు అభినందించారు.

ఎప్ సెట్ ఫలితాలలో ఎస్ ఆర్ కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం

నల్లగొండ, మే 17, ప్రభాతవార్త:

ఆదివారం ప్రకటించిన ఎప్ సెట్ 2026 ఫలితాలలో నల్లగొండ పట్టణంలోని ఎస్ ఆర్ జూనియర్ కళాశాల" విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి నల్లగొండ జిల్లాలో మరి ఏ కళాశాల సాధించలేని విధంగా ర్యాంకులు సాధించి జిల్లా చరిత్రను తిరగరాశారు. కళాశాలకు చెందిన . హుదా 919 ర్యాంక్,లక్ష్మీ సుధా 1169 మల్లికార్జున్ 1703 ర్యాంకును సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు . అదే విధంగా అనిత 2658, బుష్రా 4424, సాయికిరణ్ 6496, ఉష 7450, వైష్ణవి 8098, సుస్మిత 10898 సాధించి ఎస్ ఆర్ జూనియర్ కళాశాలను జిల్లాలో అగ్రగామి కళాశాలగా నిలిపారు. 15 వేల లోపు ర్యాంకులు మొత్తం 20 మంది విద్యార్థులు సాధించి ఎస్ ఆర్ జూనియర్ కళాశాల"ను జిల్లాలో అగ్రగామి కళాశాలగా నిలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను వారి తల్లిదండ్రులను అందుకు సహకరించిన అధ్యాపక బృందానికి యస్ ఆర్ కాలేజ్ చైర్మన్ ఎనుగందుల వర్ధ రెడ్డి , డైరెక్టర్ సంతోష్ రెడ్డి,సీఈవో సురేందర్ రెడ్డి లు అభినందనలు తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికబద్ధమైన విద్యాబోధన, అంకితభావం కలిగిన యాజమాన్యం ,అధ్యాపకబృందం కృషివలన ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగిందని ఎస్ ఆర్ కాలేజెస్ , స్కూల్స్ జోనల్ ఇంచార్జ్ దోనాల శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు.

ఎం జీ యు రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకుడు కర్ర అమరేందర్‌కు ఓయూ డాక్టరేట్ ప్రధానం

నార్కట్ పల్లి ప్రభాతవార్త మే 17

గ్రామీణ, పేదరిక కుటుంబం నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ కష్టాలను తట్టుకుని శ్రద్ధ, పట్టుదలతో విద్యను ఆయుధంగా మార్చుకుని, నల్గొండ జిల్లా చిన్ని సూరారం గ్రామానికి చెందిన కర్ర అమరేందర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. ‘‘డిజైన్ అండ్ మైక్రోవేవ్ అసిస్టెడ్ సింతెసిస్ ఆఫ్ హేటిరోసైక్లిక్ కాంపౌండ్స్ కంటైనింగ్ ఎన్ , ఎ స్ అండ్ ఓ ఆటోమ్స్ – డాకింగ్ స్టడీస్ విత్ బయాలజికల్ ఇవాల్యుయేషన్ ’’ అనే అంశంపై డా. ఎం. రాధిక అసోసియేట్ ప్రొఫెసర్, రసాయన శాస్త్ర విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో అమరేందర్ విజయవంతంగా తన పరిశోధన ప్రబంధాన్ని పూర్తిచేశారు. నల్గొండలోని ఎన్జీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పీజీ చేసిన అమరేందర్, ప్రస్తుతం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, నల్గొండలో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్)గా సేవలందిస్తున్నారు.తమ పీహెచ్‌డీ పరిశోధనలో ఆయన మైక్రోవేవ్ ఆధారిత గ్రీన్ కెమిస్ట్రీ పద్ధతుల ద్వారా వేగంగా, అధిక దిగుబడితో కొత్త హెటరోసైక్లిక్ సంయోగాలు సిద్ధం చేసి, కంప్యూటేషనల్ (డాకింగ్) అధ్యయనాలు మరియు ప్రయోగాత్మక జీవక్రియాత్మక ఫలితాల మధ్య భరోసా కలిగించే సంబంధాన్ని నిరూపించారు.అభివృద్ధి చేసిన సంయోగాల

డ్రగ్స్ లైక్నెస్ , ఏ డి ఎం ఈ లక్షణాలను శాస్త్రీయంగా స్థాపించి, ప్రస్తుత ప్రామాణిక ఔషధాలకంటే సమానమైన లేదా మెరుగైన క్రియాశీలత చూపిన మాప్ కైనేజ్ లక్ష్యంగా ఉండే పలు లీడ్ కంపౌండ్స్‌ను గుర్తించారు. సమాజ హితమైన ఈ పరిశోధన చిన్ని సూరారం గ్రామం, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ విద్యార్థులకు కష్టపడి చదివితే ఉన్నత స్థాయిలో పరిశోధనల వరకూ ఎదగవచ్చని స్ఫూర్తినిచ్చే ఉదాహరణగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మరియు రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి ఆయనను అభినందించారు.

దేశ అభివృద్ధి కి విద్యాలయాలే దీప స్థంబాలు

విద్యా వారోత్సవాల ముగింపు సమావేశంలో ఎం జి యు వి సి

నార్కట్పల్లి ప్రభాతవార్త మే 17 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ‘‘ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక’’ లో భాగంగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో వారం రోజులుగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రసంగిస్తూ, క్రమశిక్షణ, దక్షత, బాధ్యతా భావంతో ప్రతి బోధనేతర సిబ్బంది, అధ్యాపకులు విశ్వవిద్యాలయ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే వ్యక్తి, కుటుంబం, సమాజం రూపాంతరం చెందుతుందని, గ్రామీణ ప్రాంతాల సాధారణ విద్యార్థికి కూడా నాణ్యమైన ఉన్నత విద్య అందే విధంగా సంస్థాగత ప్రణాళికలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయ దీర్ఘకాలిక ప్రణాళికను విడుదల చేసి సభికులకు వివరించారు. విశ్వవిద్యాలయం స్వల్ప, దీర్ఘకాల ఇన్ఫ్రాస్ట్రక్చరల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ద్వారా కొత్త కళాశాలలు, హాస్టళ్లు, అకాడమిక్ బ్లాకులు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, ఆరోగ్య కేంద్రాలు, లైబ్రరీ మరియు ఇంజినీరింగ్ విభాగ విస్తరణ వంటి పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేస్తున్నట్టు వైస్ ఛాన్సలర్ వివరించారు. బోధనలో ఔట్కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ , నూతన పాఠ్య విధానాలు, రిమీడియల్ టీచింగ్, మెంటరింగ్ సిస్టమ్, పరిశోధనోత్సాహం, నాణ్యమైన విద్యార్థి ప్రాజెక్టులు, డాక్టరల్ రీసెర్చ్ మెరుగుదలకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది పారదర్శక పరిపాలన, రికార్డు నిర్వహణ, విద్యార్థి సేవల బలోపేతంలో కేంద్రీయ భాగస్వాములని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మీడియా వంటి స్టేక్ హోల్డర్లతో సమన్వయాన్ని బలోపేతం చేసి, గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యా ఫలాలను సద్వినియోగం చేసుకునేలా విశ్వవిద్యాలయం సంకల్పంతో ముందుకు సాగుతోంది అని ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ డా హరీష్ కుమార్, డా శ్రీనివాసరెడ్డి, ఎస్ ఓ బేగ్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ డ్వై వార్షిక సమావేశంలో ఏబీపీఎం సన్మానించిన నాయకులు

ఆత్మకూరు ఎం మే 17 ప్రభాతవార్త

ఆత్మకూరు ఎం మండలంలో పోస్టల్ బిపిఎం గా మేడి అంజయ్య నూతన కార్య వర్గంలో ఎన్ను వారికి అతనికి అధ్యక్షునిగా మేడి అంజయ్య ఎన్ను కోవడంతో అతని యూని యన్ నాయకులు ఘనంగా సన్మా నించారు ఈ కార్య క్రమంలో పోస్టల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎల్ దామోదర్ రెడ్డి కోశాధికారి ఏ యాదయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు

ఎస్వీఎం పాఠశాల పూర్వ విద్యార్థులకు ఘనంగా సన్మానం,

ఆత్మకూరు ఎం మే 17 ప్రభాత వార్త

ఆత్మకూర్ ఎం మండల కేంద్రంలో భువనగిరిలో కలెక్టర్ కార్యాలయంలో విద్యా వారోత్సవాల సందర్భంగా సరస్వతి విద్యాలయంలో చదివిన విద్యార్థులకు ఘనంగా జిల్లా స్థాయిలో సన్మానించారు .అనంతరం 2026 పదవ తరగతి ఫలితాల్లో మండల జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాల పూర్వ విద్యార్థులు ది గోజు విష్ణు, యాస.సుధాకర్ రెడ్డి, లను జిల్లా విద్యాధికారి సత్యనారాయణ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి ,అడిషనల్ కలెక్టర్ ,చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎం మండల ఎంఈఓ కే మహాదేవ రెడ్డి, సరస్వతి విద్యాలయం పాఠశాల కరస్పాండెంట్ తొర్ర విష్ణు ప్రిన్సిపాల్ పంజాల నరసయ్య గౌడ్ , వైస్ ప్రిన్సిపాల్ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి వార్త

గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం

ఆత్మకూర్ ఎం మే 17 ప్రభాత వార్త

ఆత్మకూరు ఎం మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డులో రెండు నెలలైనా 10 శాతం కొనుగోలు చేయలేని ప్రభుత్వం ఏమి చేస్తుందని సర్పంచ్ బి సు ధనలక్ష్మి చందర్ గౌడ్ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కుప్పలుగా పోసి రైతులను నట్టేట ముంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో 170 మంది రైతులు మార్కెట్లో పోస్తే ఇప్పటి వరకు 30 మంది రైతులకు కొనుగోలు జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు .వేరే గ్రామాల నుండి ఓట్ల కోసం గ్రామాల ద్వారా నుంచి రాజకీయం చేసి మార్కెట్లో పోసి దళారీలకు అమ్ముతున్నారని సర్పంచ్ బీసీ ధనలక్ష్మి ఆరోపించారు. ఆత్మకూరులో పోసిన వడ్ల కుప్పలను వెంటనే కాంట్రా లారీల ద్వారా మార్కెట్ ద్వారా తరలించాలని నినాదాలు ఇచ్చారు. అనంతరం మార్కెట్ యార్డుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీసు చందర్ గౌడ్ అఖిలపక్ష పార్టీల నాయకులు కోరే భిక్షపతి ,మోహన్ రెడ్డి ,మాద శ్రీను ,బండారు సత్యనారాయణ లోడి వెంకటయ్య, నాతి రాజు గౌడ్, మజ్జిగ రాంబాబు ,మజ్జిగ రమేష్ , యాస వెంకట్రెడ్డి, పంజాల సందీప్ , పంజాల రాజు తదితరులు పాల్గొన్నారు.

చెరుపల్లి పరమేశం మరణం గ్రామానికి తీరని లోటు

నార్కెట్ పల్లి ప్రభాతవార్త మే 17 బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెరువుపల్లి పరమేశం శనివారం సాయంత్రం అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. ఆయన మరణం గ్రామానికి తీరని లోటుగా భావిస్తున్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ఆదివారం ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరమేశం సాధారణ పద్మశాలి కుటుంబంలో జన్మించి, బ్రాహ్మణ వెల్లంల సర్పంచ్‌గా, పద్మశాలి సంఘ నాయకునిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. గ్రామంలో మంచినీటి సౌకర్యం కోసం బోరు పంపులు, మట్టి రోడ్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. చేనేత సంఘం అధ్యక్షుడిగా కూడా విశేష సేవ లందించారని ఆయన చేసిన సేవలను మనందరం కలిసి కొనసాగించడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని మురళీధర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత అధ్యక్షుడు కందగట్ల గణేష్, జిల్లా నాయకులు నామని ప్రభాకర్, కర్నాటి బిక్షం, చెరువుపల్లి రఘుపతి, చెరువుపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు. వారు పరమేశం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

సీపీఎం వేములపల్లి మండల కమిటీ డిమాండ్

వేములపల్లి ,మే 17 ప్రభాత వార్త వేములపల్లి మండల కేంద్రంలోని గ్యాస్ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా ఈరోజు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారం మోపుతూ నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టడంలో పూర్తిగా విఫలమైందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం వేములపల్లి మండల కార్యదర్శి పాదూరి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలను అమలు చేస్తూ సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెంచుతోందని విమర్శించారు. వంట గ్యాస్ ధరలు అమాంతం పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కారణంగా రవాణా ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యులు రెముడాల పరుశురాములు, రొండి శ్రీను, రైతు సంఘం జిల్లా నాయకులు పాల్వాయి రామ్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు పెంటమల్ల సుకన్య, నాయకులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శేషు సార్ చేసిన కృషి అభినందనీయం

మిర్యాలగూడ, మే 17. ప్రభాతవార్త:

ఉపాధ్యాయుడిగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు సామాజిక సేవా దృక్పథంతో పాటు సమాజ సేవే పరమావధిగా కామ్రేడ్ శేషు సార్ చేసిన సేవలు అభినందనీయమని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బకాలవాడలో డిటిఎఫ్ ఉమ్మడి నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కామ్రేడ్ శేషు సార్ స్మారక విద్యా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లా ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన కామ్రేడ్ శేషు విద్యారంగం ద్వారా సామాజిక సమస్యల పట్ల స్పందించి సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకుంటూ సమాజ మార్పునకు కృషి చేసేందుకు విద్యా సదస్సుల ద్వారా సామాజిక సమస్యల విశ్లేషించి సమసమాజ స్థాపనకు కృషి చేశాడన్నారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మతతత్వం విస్తరిస్తున్న విధానం, తెలంగాణలో దాని ప్రభావం వంటి అంశాలపై లోతుగా అధ్యయనం చేసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ విద్యా ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ కామన్ స్కూల్ విద్యా విధానం కొరకు శాస్త్రీయ విద్యా విధానం సాధనకై సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్మన్ సిడి రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి లింగయ్య, నల్గొండ, సూర్యాపేట జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి వెంకటేశం, షేక్ ఉమర్,పి వెంకులు, పి. బిక్షం, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తయ్య, శేషు మిత్ర మండలి సభ్యులు రామయ్య, అమృతయ్య, కిరణ్మయి, సంఘ బాధ్యులు గోపీ, మోహన్ రావు, గణేష్, భిక్షమయ్య, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

టామ్కోశిక్షణలతో లక్షలాది ఉద్యోగాలు

మంత్రి వివేక్

మిర్యాలగూడ, మే 17 ప్రభాతవార్త టామ్కోశిక్షణల ద్వారా జర్మనీలో లక్షలాది ఉద్యోగాలు లభిస్తాయని కార్మిక ఉపాధికల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మిర్యాలగూడ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోడి రెక్క శౌరి అంత్యక్రియలకు ఆదివారం హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగ యువత జర్మనీ బాషలో పట్టు సాదించాలన్నారు. తద్వారా లక్షలాది మందికి నర్సింగ్ ఐ టీ విభాగంలో ఉద్యోగ ఉపాధి లభిస్తుంద న్నారు. నిరుద్యోగ యువత కి ఉపాధి కల్పించే దిశగా మిర్యాలగూడ నకిరేకల్ పట్టణాల్లో ప్రత్యేక శిక్షణ శిబీరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్న మంత్రి ధాన్యం దిగుమతులు శరవేగంగా అయ్యేలా మిల్లర్ల సహకారంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు ఈ నెలాఖరులోగా ఐకెపి కేంద్రాల్లోని ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్న మంత్రి ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా పూర్తయి గృహ ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. జూన్ నెలలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నాం వచ్చే నెలలో రెండు లక్షల మందికి పెన్షన్లు జారీ చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ, నకిరేకల్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా నాయకులు చిలుకూరు బాలు, గుడిపాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మ తల్లి జాతర వేడుకలు

మాడుగులపల్లి, మే 17 ప్రభాత వార్త

గ్రామంలోని ప్రజలకు, పాడి పంటలకు,ఎలాంటి అరిష్టాలు రాకుండా కాపాడే గ్రామ దేవతగా, అత్యంత శక్తి వంతమైన దేవతగా పూజ లందుకుంటున్న గంగమ్మ తల్లిని కొలుస్తారు. గజలాపురం గ్రామంలో ఆది, సోమవారం నాడు జరిగే గంగమ్మ తల్లి జాతరలో, బేరేల మోతల తో,వివిధ వేశాధరణలతో, భక్తులు తమ భక్తిని చాటు కోవడానికి, అమ్మ వారికి మొక్కులు చెల్లించుకునే కార్యక్రమం మొదలవుతుంద ని, కోరిన మొక్కులను తీర్చే గంగమ్మ తల్లి జాతరను గ్రామస్థులంద రు అత్యంత భక్తి శ్రద్దలతో, ఆచార వ్యవహారాల నడుమ ఘనంగా నిర్వహించ నున్న ట్లు,గ్రామ సర్పంచ్ బ్రాహ్మణుల రోజా,ఉప సర్పంచ్ ఉగ్గిడి సత్యనారాయణ,మాజీ సర్పంచ్ భారీ కొండయ్య, ఆలయ కమిటీ సభ్యులు లోడంగి సైదులు, యల్లబోయిన శేఖర్,ఉగ్గిడి గురప్ప,భారీ నాగరాజు,లు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ రెడ్డి

చిట్యాల రూరల్, మే 17, ప్రభాతవార్త : కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించి 40 రోజులు గడుస్తున్నప్పటికీ రైతుల ధాన్యం ఇంకా కొనుగోలు కాకపోవడం బాధాకరమని, రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కొనుగోళ్లను వేగవంతం చేయాలని కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల మండలంలోని ఆరెగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు పీకే వెంకన్నతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని ధాన్యం రాసులను పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆరెగూడెం కేంద్రంలో సుమారు 150 మంది రైతుల వద్ద కుప్పలు ఇంకా కొనుగోలు కాకుండా మిగిలి ఉన్నాయని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతలేని బస్తాలు ఉపయోగిస్తున్నారని, మిల్లుల వద్దకు చేరిన లారీలను అదే రోజు అన్‌లోడ్ చేసేలా చూడాలని, లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యలపై వ్యవసాయ శాఖ మంత్రి, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ ఇంఛార్జి నకిరేకంటి మొగులయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, బట్టి రమేష్, మురాళ్ళ తిరుమలేష్, దామనూరి వెంకటేష్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ వార్త

లిఫ్ట్ పనులను పూర్తి చేయాలి

మాడుగులపల్లి, మే 17 ప్రభాత వార్త

తోపుచర్ల లో 14 వ ఎత్తి పోతల పతకం కింద, 2 వ భావి వద్ద అసంపూర్తిగా ఉన్న తోపుచర్ల లిఫ్ట్ పనులను పరిశీలించిన బిఆర్ఏస్ నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిఆర్ఏస్ హయాంలో ప్రారంభించిన పనులను, కాంగ్రెస్ ప్రభుత్వం లో ఒక్క ఇంచు పనులు కూడా ముందుకు సాగడం లేదని, ఇకనైనా తోపుచర్ల లిఫ్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో,బిఆర్ఏస్ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి.మండల పార్టీ అధ్యక్షులు పాలుట్ల బాబయ్య, జెర్రీ పోతుల రాములు గౌడు,రాయపు వెంకన్న,నన్నెబోయిన రమేష్ తదితరులున్నారు.

నూతన వధు వరులను ఆశీర్వదించిన మంత్రి

మాడుగులపల్లి, మే 17 ప్రభాత వార్త

మండలంలోని, తోపుచర్ల గ్రామానికి చెందిన నూతన వధు వరులు, జిల్లా మాల మహానాడు నాయకులు బొప్పని నగేష్ సోదరుడు, బొప్పని రవి దివ్య లను ఆశీర్వదించిన రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామీ.వారి వెంట స్థానిక శాసన సభ్యులు బత్తుల లక్ష్మా రెడ్డి,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాలమహా నాడు సంఘం నాయకులు, తాళ్లపల్లి రవి, జూడి రాజు, మాడుగుల శ్రీను,బొప్పని నగేష్,ముండ్ల గిరి కాంతయ్య. సంఘం నాయకులు తదితరులు న్నారు.

వైభవంగా విద్యా విజయోత్సవం

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు,క్రీడాకారులకు సన్మానం

నేరేడుచర్ల మే 17 ప్రభాతవార్త ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం విద్యా విజయోత్సవాన్ని నేరేడుచర్ల లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వైభవంగా నిర్వహించారు,మండల పరిధిలొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలొ పదవ తరగతి ఫలితాలలొ మండల ప్రథమ ఆయా పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు దాతలు అందించిన నగదు బహుమతులను ఎంపీడీవో శ్యాంసుందర్ రెడ్డి, ఎంఈఓ ఎం బాలు కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్ పురపాలిక కో ఆప్షన్ సభ్యులు అలక శ్రవణ్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, పుట్లూరి సత్యనారాయణ రెడ్డి,ఎడవల్లి రవీందర్ రెడ్డి లు శాలువా మొమెంటోలతో ఘనంగ సన్మానించారు, 558/600 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించిన సోమారం విద్యార్థిని కొండ లోహితకు నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, నేరేడుచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం లిఖిత(536/600)కు నేరేడుచర్ల పురపాలిక కో ఆప్షన్ మెంబర్ అలక శ్రవణ్ రెడ్డి 10000/ల చొప్పుననగదు బహుమతులను, పెంచికల్దిన్నే ఉన్నత పాఠశాల విద్యార్థి బి వరుణ్ తేజ్(550/600)కు చలసాని ఫౌండేషన్ నిర్వాహకులు చలసాని రాజీవ్, దిర్శించర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని కర్నే నిఖిత (542/600)కు

వ్యాపారవేత్త చీదెళ్ల అనిల్ కుమార్,దాచారం ఉన్నత పాఠశాల విద్యార్థిని సిహెచ్ సౌమ్య (513/600) కు దాచారం సర్పంచ్ సిహెచ్ వీరారెడ్డి రూ 5000/ల చొప్పున నగదు బహుమతులు అందించారు నేరేడుచర్ల ఉన్నత పాఠశాల నందు ద్వితీయ స్థానం సాధించిన నాలం దర్శిని (528/600), తాళ్లపల్లి రోహన్ (528/600) లకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు బట్టు మధు రూ 2500/ల చొప్పున , సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడల్లో ప్రథమ స్థానంతో రాణించిన నేరేడుచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.కె నియామత్ (లాంగ్ జంప్) బంటు సాత్విక్ (రన్నింగ్) లకు రూ 1000/ల చొప్పున కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్ నగదు బహుమతులు అందించారు, 1600 రూపాయలతో లక్ష్మీనారాయణ మొమెంటోలను అందించారు పాఠశాలల ఉపాధ్యాయులు ఎం సైదులు రాఘవరెడ్డి చల్లా ప్రభాకర్ రెడ్డి జానకి రాములు ఎం నాగమణి కొణతం వెంకట్ రెడ్డి టి రామ్మూర్తి ఎం యాదగిరి కట్ట శ్రీనివాస్ రెడ్డి లాల్ సాహెబ్ సరస్వతి పాల్గొన్నారు

హుజూర్ నగర్ వార్త

18 సిమెంట్ బల్లాల ఏర్పాటు

నేరేడుచర్ల మే 17 ప్రభాతవార్త

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామాపురం ఏడవ వార్డు కౌన్సిలర్ వాస జ్యోతి శేఖర్ సహకారంతో మలిగిరెడ్డి సైదిరెడ్డి ఝాన్సీ , జంగిలి ఝాన్సీ వీరయ్య కుటుంబం సభ్యుల జ్ఞాపకార్థం,రామాలయం దగ్గర, బస్తీ దవఖాన ,ప్రధాన కూడలిలో 51 వేల రూపాయల18 సిమెంటు బల్లాలను ఏర్పాటు చేశారు.

2920 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

నేరేడుచర్ల మే 17 ప్రభాతవార్త

నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దాన్యం కొనుగోలు కేంద్రంలో 2920.8 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సహకార సంఘం ముఖ్య కార్యనిర్వాణాధికారి శ్రీనివాస్ తెలిపారు, 55 మంది రైతుల వద్ద 7302 బస్తాల ధాన్యం కొనుగోలుకు గాను 6977791.2 రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉండగా మొత్తాన్ని చెల్లించినట్లు, సన్న రకం వడ్లకు బోనస్ చెల్లించాల్సి ఉందన్నారు,సన్న రకం వరి ధాన్యాన్ని 23 మంది రైతుల వద్ద నుండి3174 బస్తాల కు గాను1269.60 క్వింటాళ్ళు కొనుగోలు చేసి3033074.40 రూపాయలు రైతులకు చెల్లించినట్లు దోడ్డు రకం వరి ధాన్యాన్ని 32 మంది రైతుల వద్ద నుండి 4128 బస్తాలు1651.20 క్వింటాళ్ళు కొనుగోలు చేసి3944716.80 రూపాయలు రైతుల ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు

వైభవంగా సూర్యఅర్చనలు, గోమాతకు పూజలు

మేళ్ళచెరువు మే 17 ప్రభాతవార్త:

స్థానిక శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభుశంభులింగేశ్వరస్వామి,

శ్రీగోదాభూనీల సమేత శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీదేవిభూదేవి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాలలో ఆదివారం సంధర్భముగా సూర్య దేవునికి సూర్య అర్చనలు, సూర్య నమస్కారములు, హారతులు, గోమాతకు విశేష పూజలు, గోప్రదర్శనలు, గుడిసేవలు, అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో నాగేళ్ళ శంబిరెడ్డి, కొంకపాక శివవిష్ణు వర్ధనశర్మ, శివధనుంజయశర్మ, సాయిమహేశ్ శర్మ, నరగిరి నాధుని నరసింహాచార్యులు, రంగబట్టరాచార్యులు, సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణమాచార్యులు, నల్లాన్చక్రవర్తుల వెంకట ప్రసాదాచార్యులు, చెట్లూరి వాసుదేవాచార్యులు, బట్టర్ శేషు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈనెల 18,22 న ధ్యానము, పరిశుభ్రత కార్యక్రమాలు

నేరేడుచర్ల మే 17 ప్రభాతవార్త ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 18, 22 తేదీలలో క్రీడా శాఖ ప్రణాళికలు భాగంగా నేరేడుచర్ల లోని పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ధ్యానము, పబ్లిక్ స్థలాలలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, యూత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎండిఓ సోమ సుందర్ రెడ్డి ఆదివారంఒక ప్రకటన లో కోరారు

చదువుకు మించిన ఆస్థి మరోకటి లేదు

మేళ్ళచెరువు మే 17 ప్రభాతవార్త:

మండలములోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యావారోత్సవాలు జవహర్ బాల భవన్ దినోత్సవం సాంస్కృతిక మరియు విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సంధర్భముగా మండల విద్యాధికారి షేక్ ఫాతిమాబేగం మాట్లాడుతూ చదువుకు మించిన గొప్ప ఆస్థి మరొకటి లేదని అన్నారు. నిరుపేదలు కూడా శ్రద్ధగా పట్టుదలగా చదివి అత్యంత ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు అనేకం ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో శ్రద్ధా పట్టుదలతో చదువుకొని గొప్ప భవిష్యత్తును పొందాలని కోరారు. ఈ కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన విద్యా వారోత్సవాలు

క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

హుజూర్ నగర్ టౌన్, మే 17, ప్రభాత వార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ విద్యా కార్యక్రమాలు ఆది వారంతో ముగిశాయి. విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జాతీయస్థాయి మహిళా క్రికెట్ లో బ్యాట్స్మెన్ గా ప్రతిభ చాటిన బి ఏ మొదటి సంవత్సరం విద్యార్థిని పచ్చిపాల మహేశ్వరి, ఎంపీ సీఎస్ సెకండ్ ఇయర్ విద్యార్థి రామిశెట్టి రుషిప్ ప్రీతం మహాత్మా గాంధీ యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల లో కళాశాల తరపున పాల్గొని రాష్ట్రస్థాయి టీం కు ఎంపికైన రామిశెట్టి రుషిన్ ప్రీతం లను ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బృందం ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎస్ ప్రియాంక, బీ. శ్రీనివాస్, డాక్టర్ నాగేష్, ఎస్ బాలరాజు, బి నాగార్జున, డాక్టర్ జే వెంకటేశ్వర్లు, వి .లక్ష్మీనారాయణ, మాలతి , మట్ట య్య ప్రవీణ్, యోగి, రాధా, స్రవంతి, సైదా నాయక్ , విద్యార్థులు పాల్గొన్నారు

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చింతలపాలెం (ప్రభాత వార్త) మే 17: చింతలపాలెం మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దామూరి వెంకయ్య దశదిన కార్యక్రమంలో ఆదివారం హుజూర్నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు శానంపూడి సైదిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతరెడ్డి సైదిరెడ్డి, నన్నే బుజ్జి, సలోమన్, ఆరోన్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాటయోధుడు పశ్య రామిరెడ్డి

హుజూర్ నగర్ టౌన్, మే 17, ప్రభాతవార్త :

తెలంగాణ స్వాతంత్ర్య సమర యోధుడు సిపిఐ నాయకుడు దివంగత పశ్య రామిరెడ్డి ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. ఆది వారం హుజూర్ నగర్ పట్టణం లోని సిపిఐ పార్టీ కార్యాలయం లో దివం గత పశ్య రామిరెడ్డి వర్ధంతి సభను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దివంగత పశ్య రామిరెడ్డి త్రపటానికి సిపిఐ పార్టీ నాయ కులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూని స్టు సిద్ధాంతాలు , ప్రజా ఉద్యమాల తో హుజూర్ నగర్ తాలూకా ప్రాం తంలో రామిరెడ్డి చేసిన పోరాటాలు గొప్పవన్నారు. ఆదర్శవంతమైన కమ్యూనిస్ట్ గా పార్టీ ఆశయాల కోసం జీవితాంతం కృషి చేశారన్నా రు. ఆయన ఆశయాల సాధన లో పనిచేసి నిజమైన నివాళి అందిం చాలని కోరారు. సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లా వుల రాములు, నాయకులు కంబా ల శ్రీనివాస్, సోమగాని కృష్ణ, ఇంది రాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, చెన్నగాని సైదులు, యల్లావుల రమే ష్, జక్కుల రమేష్, మామిడి నరస య్య తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

చింతలపాలెం (ప్రభాతవార్త) మే 17: మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని అయినటువంటి గుగులోతు కావ్యశ్రీ క్రీడారంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందింది. సూర్యాపేట జిల్లా నుంచి తొలిసారిగా సాఫ్ట్బాల్ నేషనల్ పోటీలకు ఎంపికై ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని నేషనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచింది . ఈ సందర్భంగా విద్యార్థినికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ ఆదివారం ఆమెను సన్మానించి అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థిని సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎం. సత్తిరెడ్డి, పీఈటీ క్రాంతికుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు

యాదాద్రి దేవస్థానం వర్తక సంఘం రద్దు చేసి దుకాణాలను టెండర్ వేయాలని వినతి

యాదగిరిగుట్ట మే 17 ప్రభాతవార్త

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామి దేవస్థానంలో గత కొన్ని సంవత్సరాలుగా వర్తక సంఘం పేరు పై దుకాణాలను టెండర్ వేయకుండా దేవస్థానం ఆదాయానికి సుమారు 30 కోట్ల ఆదాయం గండి కొడుతూ వ్యాపారులు లబ్ధి పొందుతున్నారని కోరుతూ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి దేవాదాయ శాఖ కొండా సురేఖ లకు వినతి పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ కొండపైన కల సెల్ఫోన్ లగేజీ కౌంటర్ సంవత్సరానికి రెండు కోట్ల 62 లక్షలు అలాగే దీపారాధనకు కేవలం 11 నెలలకు కోటి పది లక్షలు టెండర్ పై ఆదాయం వస్తుండగా దుకాణాలపై మాత్రం కోటి 69 లక్షల దేవస్థానంలో జమ చేస్తున్నారని దీనిపై దేవస్థానం అధికారులు మాట్లాడటం లేదని

సమితి సభ్యులు ఆరోపించారు. గతంలో కొండపై వివిధ పేర్లతో 112 తాత్కాలిక దుకాణాలు టెండర్ల ద్వారా తీసుకున్న టెండర్ దారులు కార్యక్రమంలో సంఘం పేరుతో దుకాణాలను నడుపుతున్నారని ఇంత అన్యాయం జరుగుతున్న దేవస్థానం అధికారులకు చీమకుట్టినట్లు లేదని ఆరోపించారు. దుకాణ వ్యాపారదారులు దుకాణాలను టెండర్లు వేయకుండా దేవస్థానం అధికారులతో కొమ్ముకై దుకాణాలు నడుపుకుంటున్నారని ఆరోపించారు. ఇట్టి దుకాణాలను టెండర్లు వేస్తే ఆ టెండర్లలో నిరుద్యోగ యువకులు తీసుకునే అవకాశం ఉందని అలాగే దేవస్థానానికి కూడా ఆదాయం పెరుగుతుందని సమితి సభ్యులు తెలిపారు కావున వెంటనే ఇట్టి దుకాణాలను టెండర్లు వేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చేకూర్చాలని మంత్రులకు వినతి పత్రాలను అందజేశారు.

యాదాద్రి కి పెరిగిన భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, మే 18,(ప్రభాతవార్త):

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం సెలవు దినం పురస్కరించుకొని భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది ఈ సందర్భంగా ఆలయ వరుసరాలు గర్భాలయం, క్యూలైన్లు,ప్రత్యేక దర్శనం లైన్లు,ప్రసాద్ విక్రయశాల క్యూలైన్లు,తడితర ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దీంతో ఎక్కడ చూసినా భక్తుల కోలాహలమే

కొండపైన కనిపించింది. స్వామివారి పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవాలను దర్శించుకున్నారు. సెలవు దినం

పురస్కరించుకొని భక్తులు ఉదయం నుంచి క్యూలైన్లలో భక్తులు నిలుచున్నారు.స్వామివారి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.స్వామి అమ్మవాలను సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. సత్యనారాయణ వ్రత మండపం కళ్యాణకట్ట విష్ణు పుష్కరిణి తదితర ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తుల ఇబ్బందులు :కొండపైన ఎండ వేడిమికి చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు మంచినీరు దొరకక అల్లాడిపోయారు. కొండపైన విష్ణు పుష్కరణ వద్ద దుకాణాలలో కొబ్బరికాయలను 100 రూపాయలకు అమ్ముతూ భక్తులను చాలా ఇబ్బందు లకు గురి చేశారు. అలాగే కొండపైన గల నిత్య దీపారా ధనలో భక్తులకు ఒక్కో దీపాన్ని వంద రూపాయలకు అమ్ముతూ భక్తులను నిలువునా దోపిడీకి గురి చేశారని భక్తులు ఆరోపిం చారు. వృద్ధులను చిన్నారు లను తరలించడానికి ఉపయోగపడే బ్యాటరీ వాహనాలలో వృద్ధులను కాకుండా మిగతా

వారిని ఎక్కించుకొని తరలిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసాద విక్రయాశాలలో సాయంత్రం వేళ టికెట్టు లేకుండా ప్రసాదాలు నమ్ముతున్నారని భక్తులు ఆరోపించారు.

చంద్రయ్యను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఆలేరు, మే 17 (ప్రభాతవార్త) :

గుండ్లగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు బింగి నరేష్ తండ్రి చంద్రయ్య ఇటీవల ప్ర మా ద వశాత్తు తా టి చె ట్టు పై నుంచి పడి తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఆయనను పరామర్శించారు. చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, చంద్రయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

బొందుగులలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజాపేట మే 17 ప్రభాతవా

బొందుగుల గ్రామంలో ఉన్నత పాఠశాలలోని 2006 2007 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. విద్య నేర్పిన గురువులను ఆహ్వానించిన పూర్వ విద్యార్థులు విద్యార్థి దశలోని తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులతో మరోసారి ఆశీర్వాదం పొందారు. వారిని సత్కరించారు. సామూహికంగా భోజనాలు చేసి ఉదయం నుండి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. చదువుకున్న పాఠశాలను చూసుకున్న పూర్వ విద్యార్థులు సంతోషపడ్డారు.

ప్రభుత్వ విప్ బీర్ల ని కలిసిన బీరప్ప యూత్

రాజాపేట మే 17 ప్రభాతవార్త

ఆలేరు శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ను ఆదివారం బొందుగుల బీరప్ప యూత్ కమిటీ సభ్యులు కలిశారు. యూత్ అసోసియేషన్ తరుపున యూత్ భవనం, యూత్ అసోసియేషన్ అభివృద్ధి కోసం అడగగా సానుకూలంగా స్పందించిన బీర్ల ఐలయ్య త్వరలోనే భవన నిర్మాణానికి నిధులు మంజూరి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు జెట్ట శ్రీకాంత్, ,ఉపాధ్యక్షులు బాల్దా శ్రీకాంత్, కోశాధికారి మర్ల కర్ణాకర్ ,యూత్ సభ్యులు బాల్దా కర్ణాకర్ ,జెట్ట సురేష్ బాల్దా శ్రీకాంత్, గవ్వల ఉపేందర్, 3వ వార్డ్ సభ్యులు మర్ల రమేష్ కురుమ సంఘం అధ్యక్షులు బండ ఆంజనేయులు,ఉపాధ్యక్షులు మర్ల సమ్మయ్య ,కురుమ సంఘం మాజీ అధ్యక్షులు మాపు భాస్కర్ తదితరులు ఉన్నారు

ఆలయంలో సుదర్శన హోమం

యాదగిరిగుట్ట మే 17 (ప్రభాత వార్త):

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో ఆది వారం స్వామి అమ్మ వార్ల కు సుదర్శన నరసింహ హోమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. సందర్భంగా స్వామి అమ్మవార్ల కు విశేష పూజలను, యాగశాలలో హోమాలను, స్వామి అమ్మవార్లకు విశేష సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మ వార్లకు ఉదయం పంచామృ తాలతో అభిషేకం గావించా రు. అనంతరం స్వామి అమ్మ వార్లకు పట్టు వస్త్రాలను ధరింపజేసి వివిధ రకాల పుష్పమాలికలతో శుబాయ మానం గా అలంకారం చేశారు .అనంతరం స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసిన అనంతరం ఉత్సవమూర్తులను సేవలో అధి ష్టింపజేసి ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగింపు నిర్వహిం చారు. యాగశాలలో సుదర్శనం నారసింహం లక్ష్మీ గరుడ వంటి దేవతల మూలమం త్రాలతో హవనం నిర్వహించా రు.అలాగే సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేక సేవలో అధిష్టింపజేసి ఆలయ తిరుమడ వీధులలో మంగళ వాయిద్యాలతో భాజ భజంత్రీలతో వేద పండితుల వేదనాధాలు,వేదమం త్రాల మధ్య సుమారు గంట పాటు సేవను ఊరేగింపు చేశారు . ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్ర చార్యులు, కిరణ్ కుమార్ ఆచార్యులు, శ్రీధరాచార్యు లు, వజ్జల లక్ష్మణాచార్యులు, నరేష్ కుమార్ ఆచార్యులు, ఆలయ అధికారులు సురేం దర్ రెడ్డి చంద్రమోళి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

25 ఏళ్ల తర్వాత కలిసిన బాల్యమిత్రులు.. ఆప్యాయతలతో ఆత్మీయ సమ్మేళనం

ఆలేరు, మే 17 (ప్రభాతవార్త):

ఆలేరు పట్టణంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో 20002001 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల (బాల్యమిత్రుల) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఇమ్మిడి నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. దాదాపు 25 సంవత్సరాల అనంతరం ఒకేచోట కలుసుకున్న బాల్యమిత్రులు పరస్పరం ఆప్యాయతలు పంచుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పాఠశాల రోజుల మధుర స్మృతులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన ఆచార్యులు బండి రాజుల శంకర్, ప్రసాద్, వెంకటేష్, సుశీల, రమాదేవి, పద్మలను శాలువాలతో ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పత్తి సతీష్, కుండే సంపత్, పూలేపాక విజయ్, బండారి శ్రీధర్, కుళ్ళ వెంకటేష్, బీదని వెంకటేష్, మొరిగాడి స్వప్న, జన్నె హారతి, వెన్నెల, రహిమత్ పాషా పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కలిసిన వెంకటేష్ గౌడ్:

రాజాపేట, మే 17 ప్రభాతవార్త

పారుపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాల వెంకటేష్ గౌడ్ తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ని మర్యా ద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపాడు.జన్మదిన సందర్భంగా హైదరాబాదులోని మల్లాపూర్ లో పలు ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఐ.కె.పి కేంద్రాలలో లారీ ల కొరతను నివారించాలి.

తుంగతుర్తి. మే 17. ప్రభాతవార్త

ఐకెపి కేంద్రాలలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతాంగం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగంపై ఉన్నదని సి.పి.ఐ(ఎంఎల్)మాస్ లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ పేర్ల నాగయ్య అన్నారు. ఆదివారం మండలం పరిధిలోని తూర్పు గూడెం గ్రామంలోని ఐకెపి కేంద్ర వద్ద పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఐకెపి కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని, రైతులు ఎలాంటి ఆందోళనలకు గురి కావద్దని ప్రకటనలు చేస్తున్న, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆవేదన చెందారు. మిల్లర్లు సిండికేట్ గా ఏర్పడి కృత్రిమ లారీల కొరత సృష్టిస్తున్నారని అన్నారు. ఐకెపి కేంద్రాలలోకి లారీలను సప్లై చేయకపోవడం, మిల్లు దగ్గరికి వచ్చిన లారీల లోడులు ఆలస్యంగా దిగుమతి చేయడం, తాలు పేరుతో,తేమ పేరుతో బస్తాకు మూడు నుండి నాలుగు కేజీల తరుగును తీయడం తదితర రూపాలలో రైతుల్ని నష్టపరుస్తున్నారని అన్నారు. రైతాంగానికి నాణ్యమైన గన్ని బ్యాగులు ఇవ్వకుండా, చిల్లులు పడిన గన్ని బ్యాగులు సప్లై చేయడం మూలాన కారిపోయిన ధాన్యాన్ని అదనంగా దోచుకుంటున్నారని ఆయన అన్నారు. ఒకవైపు వర్షాకాల సీజన్ దగ్గర పడడం, మరొకవైపు అకాల వర్షాల భయంతో కల్లాలలోని రైతుల గుండెల్లో గుబులు పుడుతుందని ఆవేదన చెందారు. మిల్లర్లు కావాలని కాలయాపన చేసి, రైతులు తమ అవసరం కొద్దీ మిల్లర్లు అడిగిన రేటుకు ఇచ్చే విధంగా ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు.. జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికార యంత్రాంగం నిత్యం పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ, మిల్లర్లు మాత్రం తమ దోపిడీ విధానాలను మానుకోవట్లేదని అన్నారు. రైతులను నష్టపరిచే విధంగా చేస్తున్న మిల్లు యాజమాన్యాలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసినారు.రైతు పండించిన పంటను ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. రైతులను దోచుకోవాలనే కుట్రలు మిల్లర్లు మానుకోవాలని హెచ్చరించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండగాని వెంకన్న, లింగంపల్లి మల్లయ్య, రైతులు గుండ్ల లింగయ్య, తాడూరి వెంకటయ్య, బత్తుల వెంకన్న, లింగంపల్లి మల్లేష్, బత్తుల మధు, బత్తుల కలమ్మ, ఎనగందుల బాయమ్మ, ఆకుల రజిత, తాడూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ నాగమల్లు ఆశయ సాధనకు కృషి చేయాలి

నాగారం మే 17 ప్రభాత వార్త

సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ సభ్యులు, అరుణోదయ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ తడకమళ్ల నాగమల్లు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. ఇటివల జరిగిన రోడ్డు ప్రమాదంలో కామ్రేడ్ నాగమల్లు ఆకాల మరణం చెందటంతో ఆదివారం మండల పరిధిలోని లక్ష్మాపురంలో నిర్వహించిన కామ్రేడ్ తడకమళ్ళ నాగమల్లు సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం తన కలం, గళంతో పోరాటాలు నిర్వహించిన కామ్రేడ్ నాగమల్లు జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని, ఆయన అడుగుజాడల్లో నడిచి నేటి యువత పోరాటాలు చేయాలని సూచించారు. కామ్రేడ్ నాగమల్లు తన జీవితంలో అనేక ఆటుపోటులు, పోలీస్ కేసులు, నిర్బంధాలను ఎదుర్కొంటూ విప్లవ ఉద్యమంలో తన కర్తవ్యాన్ని నిర్వహించడంలో ముందుండే వాడని పేర్కొన్నారు. దుబ్బాక సంజీవరెడ్డి వారసుడిగా ఈ తుంగతుర్తి ప్రాంతంలో కొనసాగాడని, అరుణోదయ సాంస్కృతిక ఉద్యమంలో అనేక రచనలు చేస్తూ పాటలు పాడుతూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో ఎంతో కృషి చేశాడని కొనియాడారు. ఈ వ్యవస్థ స్వరూప, స్వభావాలను అర్థం చేసుకొని దీనిని సమూలంగా మార్చడానికి విప్లవ రాజకీయాలే సరైనవని వాటి బాటలో తన చివరి శ్వాస వదిలే వరకు కొనసాగాడని అన్నారు. నాగమల్లు ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, న్యూడెమోక్రసీ పార్టీ నల్గొండ జిల్లా కార్యదర్శి ఇందూరు సాగర్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయగిరి, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూఐ జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అలుగుబెల్లి వెంకటరెడ్డి, పోలేబోయిన కిరణ్‌కుమార్, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు, ఎర్ర ఉమేష్, గండు నగేష్, సామ నర్సిరెడ్డి, దాసరి శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పుల్లూరు సింహాద్రి, సర్పంచ్ రవీందర్, మాజీ సర్పంచ్ సుధాకర్, మల్లెపాక వెంకన్న, కళాకారులు అనుదీప్, మల్లేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.నివాళులర్పించిన ఏపూరి సోమన్న..... సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ సభ్యులు, అరుణోదయ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ తడకమళ్ల నాగమల్లు ఇటివల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో నిర్వహించి మృతుడి దశదిన కర్మకు బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామార్శించి, రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్, బొడ్డు శంకర్, టీపీసీసీ సాం!!స్కృతిక సేన జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము ఆంజనేయులు, దశరథ తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ ర్యాంకుల్లో జయ కళాశాల విద్యార్థుల ప్రతిభ.

సూర్యాపేట, మే 17 (ప్రభాత వార్త) :

ఎంసెట్-2026 ఫలితాల్లో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు. కళాశాలకు చెందిన విద్యార్థిని జి శ్రీనిక రాష్ట్రస్థాయిలో 88 వ ర్యాంకు సాధించి ప్రత్యేక ప్రతిభ చాటింది. అలాగే పలువురు విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించి కళాశాల ప్రతిష్టను మరింత పెంచారు.ఈ ఏడాది కళాశాల నుంచి మొత్తం 269 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, వారిలో సగం మందికి పైగా 30 వేల లోపు ర్యాంకులు సాధించడం విశేషం. 5 వేల లోపు 21 మంది, 10 వేల లోపు 42 మంది, 25 వేల లోపు 94 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి విజయపథంలో నిలిచారు.ప్రధానంగా జి శ్రీనిక 88వ ర్యాంకు, ఎస్కే నేహా 145వ ర్యాంకు, ఎస్ హర్షవర్ధన్ రెడ్డి 562వ ర్యాంకు, ఎం రితిన్ శెట్టి 590వ ర్యాంకు, ఎన్ సాయి రిత్విక్ 897వ ర్యాంకు, వి గౌతమ్ కుమార్ 1157వ ర్యాంకు, డి సిరి 2625వ ర్యాంకు, జె మానస 2723వ ర్యాంకు, వై హరినాశర్మ 2724వ ర్యాంకు, సిహెవ్ శివకుమార్ 2857వ ర్యాంకు, పి జస్వంత్ 2887వ ర్యాంకు, జీ వంశీ 3720వ ర్యాంకు, కె సంతోష్ 3948వ ర్యాంకు, ఎన్ క్రిష్కా 4117వ ర్యాంకు, జి రంజిత్ 4323వ ర్యాంకు, జే లిఖిత 4296వ ర్యాంకు, ఏ నాగ నక్షత్ర 4353వ ర్యాంకు, పి అభినవ్ రెడ్డి 4700వ ర్యాంకు, బి మాన్విత్ రెడ్డి 4782వ ర్యాంకు, ఎం హర్షిత 4794వ ర్యాంకు, జి మనోవర్షిత 4982వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, సహకరించిన తల్లిదండ్రులను కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జేల్లా పద్మాలు అభినందించారు.

సూర్యాపేట వార్త

నేటి నుండి మార్కెట్లో ధాన్యం కొనుగోలు ప్రారంభం.

తిరుమలగిరి మే 17 ప్రభాతవార్త.

సోమవారం నుండి మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోలు యధావిధిగా జరుగుతాయని తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్సోజు చామంతి

నరేష్ తెలిపారు ఆదివారం చైర్మన్ యోల్సోజు చామంతి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్కెట్ కమిటీ అధ్యక్షతన కమిషన్ మరియు ఖరీదు దారుల సమావేశంలో తేదీ:18. సోమవారము నుండి మార్కెట్ యధావిధిగా క్రయవిక్రయాలు జరుపుదుము అని తెలియజేశారు కావున రైతులు ఇట్టి విషయాన్ని గమనించి నేటి నుండి మార్కెట్కు ధాన్యాన్ని తీసుకురావాల్సిందిగా కమిషన్ దారులు కోరమైనది ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి సురేష్ కుమార్ డైరెక్టర్ పాపాక సోమేశ్ సంకపల్లి నరసింహారెడ్డి సామాన్యులు కృష్ణమూర్తి వెంకన్న ప్రభాకర్ రెడ్డి కమిషన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చడం వల్ల భూసారం తగ్గుతుంది

రైతులు తగలబెట్టకుండా సద్వినియోగం చేసుకోవాలి

మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు

చిట్యాల రూరల్, మే 17, ప్రభాతవార్త :

వరి కోత అనంతరం కల్లాలలో మిగిలే వరి కొయ్యలను కాల్చడం వల్ల భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని చిట్యాల మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు అన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వెలువడే అధిక ఉష్ణానికి నేలలో ఉండే సహజ పోషకాలు, వానపాములు, సూక్ష్మజీవులు నశించి భూమి ఉత్పాదకత తగ్గిపోతుందన్నారు. అదేవిధంగా కర్బన ఉద్గారాలు విడుదలై వాయు కాలుష్యం పెరుగుతుందని, ఇది పర్యావరణానికి హానికరమని తెలిపారు. పొలంలో గాలి ప్రసరణ, నీటి నిల్వ సామర్థం తగ్గిపోవడంతో తదుపరి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. వరి కొయ్యలు తగలబెట్టడం నేరంగా వరిగణించబడుతుందని ఆయన స్పష్టం చేశారు. రైతులు వరి కొయ్యలను కాల్చకుండా భూమిలో కలిపి సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవాలని సూచించారు. కొయ్యలను చిన్న ముక్కలుగా చేసి భూమిలో కలిపి సేంద్రియ ఎరువుగా ఉపయోగించవచ్చని, డీకంపోజర్ వాడకంతో భూమి సారవంతం పెరిగి దిగుబడులు మెరుగవుతాయని వివరించారు.

అలాగే పశువుల మేత, కంపోస్ట్, బయోగ్యాస్, వర్మి కంపోస్ట్, మష్రూమ్ సాగు, పేపర్ తయారీ, బయో ఇంధన ఉత్పత్తిలో కూడా వరి కొయ్యలు ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు పర్యావరణానికి హాని కలిగించే విధానాలను నివారించి, భూసారాన్ని కాపాడే సాగు పద్ధతులను అవలంబించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెట్రో ధరల పెంపు తో ప్రజలపై పెను భారం

చౌటుప్పల్, మే 17 ప్రభాతవా

ద్రేశవ్యాప్తంగా పెట్రో ధరల పెంపుతో పేద ప్రజలపై మోడీ సర్కారు పెను భారం మోపుతుందని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మహమ్మద్ పాషా, గంగదేవి సైదులు, గోశిక కరుణాకర్ లు ఆరోపించారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని బస్టాండ్ ఎదురుగా పెట్రోల్ బంక్ ఎదురుగా పెంచిన పెట్రో ధరలను నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను పెంచి పేద , మధ్య తరగతి ప్రజల ను మరోసారి మోసం చేసిందన్నారు. డీజిల్, పెట్రోల్, ధరల పెరుగుదల వల్ల అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని అన్నారు. నిత్యవసర ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అని విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం అని పదే పదే ప్రకటించినది అని గుర్తు చేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు దాటగానే రూ.3 లకు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల కోసం మోడీ అబద్ధాలు చెబుతున్నారని ప్రజలు భావిస్తున్నారని, ఇది విశ్వాస ఘాతకం, అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, కొండె శ్రీశైలం, బోయి యాదయ్య, తూర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, భావనలపల్లి స్వామి, యాట బాలరాజు, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి రహీం, మానే శాలయ్య, భీమగోని బాలరాజు, యాట ముత్యాలు, వల్లూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి వైఖరి నిరసిస్తూ తల్లి మృతదేహంతో కూతుళ్ళ ఆందోళన

అద్దంకి నార్కెట్ పల్లి రహదారిపై బైటాయింపు

మిర్యాలగూడ, మే 17 ప్రభాతవా ర్త

ఆనారోగ్యం తో కన్నతల్లి మరణిస్తే...కనీసం పట్టించుకోని తండ్రి వైఖరికి నిరసనగా.. కుమార్తెలు తల్లి మృతదేహంతో దామరచర్ల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన బైరం శ్రీకాంత్ సువార్త లక్ష్మిలు దంపతులుకాగా వారికి కుమార్తెలు నీరజ, నిస్సి లు వున్నారు. కొన్ని నెలలుగా దంపతుల మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో శ్రీకాంత్ కొన్ని ఏళ్లగా భార్య పిల్లలకు దూరంగా ఉంటున్నాడని, విడాకులకోసం కోర్టుకు ఎక్కాడని సమాచారం. మరో మహిళతో కలిసి ఉంటున్నాడని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో లక్ష్మి ఆదివారం మృతి చెందింది. అయినప్పటికీ శ్రీకాంత్ రాకపోవడంతో కొపొద్రిక్తులైన కుమార్తెలు, బంధువులు అద్దంకి నార్కెట్పల్లి రహదారిపై మృతదేహంతో బైఠాయించి న్యాయం చేయాలంటూ కన్నీటి పర్యంతమవుతూ,తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు కదిలేదంటూ రహదారిపై బైఠాయించారు.ఈ ఆందోళనతో అద్దంకినార్కెట్పల్లి రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుమార్తెలు, కుటుంబ సభ్యులతో ఎస్సై మాట్లాడారు. చట్టపరంగా భర్త శ్రీకాంత్పై చర్యలు తీసుకుంటామని, పిల్లలకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని ఎస్సై హామీ ఇచ్చారు. పోలీసుల నచ్చజెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.అనంతరం ట్రాఫిక్ను క్లియర్ చేసి, మృతదేహాన్ని తరలించారు.

శౌరి సేవలు చిరస్మరణీయం

కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి.

మిర్యాలగూడ, మే 17. ప్రభాతవార్త:.

అట్టడుగు వర్గాల నుండి వచ్చి ప్రజల అభ్యున్నతి కోరి వారి ఆదరాభిమానాలు చురగొని అందరి మనసుల్లో చెరగని ముద్ర వేసిన దివంగత ప్రజా నాయకుడు కోడి రెక్క శౌరి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం అనారోగ్యంతో మృతి చెందిన కోడి రెక్క శౌరి కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించి మృతదేహంపై పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతాల కొరకు అవిశ్రాంతంగా అలుపెరుగని పోరాటం చేసిన ఆయన సేవా నిరతిని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కొరకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన స్ఫూర్తితో పని చేయాలన్నారు. శౌరి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ తో పాటు వ్యక్తిగతంగా తనకు తీరని లోటు అన్నారు.అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శంకర్ నాయక్ తో కలిసి శౌరి ఇంటి దగ్గర నుండి చర్చి వరకు శవపేటికనుమో సి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ నాయకులు తాళ్లపల్లి రవి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ రాజు, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్, జిల్లా నాయకులు చిలుకూరి బాలు, సర్పంచ్ బెజం సాయి, కౌన్సిలర్ దైద సోమ సుందర్, నాయకులు ముళ్ల గిరి కాంతయ్య, గుడిపాటి నవీన్, బొప్పని నగేష్, తాళ్లపల్లి నరసయ్య, ఇంద్ర కుమార్, చిలుకూరి అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ సైబర్ సెక్యూరిటీలో ప్రజ్వలకు మాస్టర్స్ పట్టా

నర్సంపేట,మే 17,ప్రభాతవార్త

నర్సంపేట పట్టణానికి చెందిన పెద్దారపు ప్రజ్వల అమెరికాలోని న్యూ జెర్సీ లో గల ప్రఖ్యాత సెయింట్ పీటర్స్ యూనివర్సిటీలో ఫోరెన్సిక్ సైన్స్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ప్రతిభ కనబరిచి మాస్టర్స్ పట్టా సాధించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా పట్టాను ఇచ్చి ఘనంగా సత్కరించారు.దీంతో ప్రజ్వల తల్లిదండ్రులు పెద్దారపు రమేష్,రాధ ఇతర కుటుంబ సభ్యులు హర్షాన్ని వ్యక్తం చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. విదేశాల్లో ఫోరెన్సిక్ సైన్స్లో మాస్టర్స్ పట్టా సాధించిన అది కొద్ది మందిలో ప్రజ్వల ఒకరు.ప్రజ్వల ఏడవ తరగతి వరకు నర్సంపేటలో,ఇంటర్ వరకు వరంగల్లో,ఫోరెన్సిక్ గ్రాడ్యుయేషన్ మధుర ఉత్తర ప్రదేశ్లో అభ్యసించింది

స్థానికుల సమస్యను వెంటనే పరిష్కరించిన కౌన్సిలర్

నర్సంపేట,యే 17,ప్రభాతవార్త

స్థానికుల సమస్యను కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ వెంటనే పరిష్కరించారు. ఆదివారం నర్సంపేట మున్సిపాలిటీ 26వ వార్డు,వరంగల్ రోడ్డులోని అయ్యప్ప నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రెండవ విద్యుత్ సబ్ స్టేషన్ కోసం ఏర్పాటు చేస్తున్న హైటెన్షన్ విద్యుత్ టవర్ రహదారికి అడ్డుగా ఉందని కాలనీవాసులు కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన కౌన్సిలర్ వెంటనే సంబంధిత విద్యుత్ కన్స్ట్రక్షన్ శాఖాధికారులను (డిఈ,ఏడి,ఏఈ),సిబ్బందిని ఘటనా స్థలానికి రప్పించారు.కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా,ఆ విద్యుత్ టవర్ పాయింట్ను రహదారికి ఆటంకం కలగని రీతిలో పక్కకు జరిపించేలా చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చౌటుప్పల్, మే 17 ప్రభాతవా

జీవనోపాధి నిమిత్తం పెట్రోల్ బంకులో విధులు నిర్వహించి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం అపసవ్య దిశలో వచ్చి మోటర్ సైకిల్ ను ఢీకొనడంతో ఓ నిండు ప్రాణం గాల్లో కలిసిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రానికి చెందిన అన్నెబోయిన మల్లేశం (45) జీవనోపాధి నిమిత్తం తూప్రాన్ పేట గ్రామంలో హెచ్ పి పెట్రోల్ బంక్ లో విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని తన సిబిజెడ్ ఏపీ 13 ఎం 4987 మోటార్ సైకిల్ పై ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో సుమా రాత్రి 11 గంటలకు సమయంలో కైతాపురం స్టేజి సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా గుర్తు తెలియని వాహనం అప సవ్య దిశలో అతివేగంతో వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల గురి కాగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు సిఐ మన్మధ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు.

ఎఫ్ సెట్ ఫలితాలలో సత్తాచాటిన కెఎల్ఎన్ కళాశాల విద్యార్థినిలు

మిర్యాలగూడ, మే 17 ప్రభాతవార్త

ఎఫ్ సెట్ ఫలితాలలో మిర్యాలగూడకు చెందిన ప్రముఖ ఇంటర్ విద్యాసంస్థ కె.ఎల్.ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థినిలు మరోసారి అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ర్యాంకులతో సత్తాచాటారు.కళాశాలకు చెందిన ఆర్.అనిత 2658, ఆర్. హాసిని 5667, అస్మాతబస్సుమ్ 6428, కే.మేఘన 6888, సిహెచ్ మోనిక 6990, ఎన్. సిరి 8282, ఎం మానస 9453 ర్యాంకులతో పాటు 10 వేల లోపు సాధించారని,20 వేల లోపు 50 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్ కుమార్, డైరెక్టర్లు టి నరేందర్ రెడ్డి,టి. హనుమంత రెడ్డి, పి.ఎల్.ఎన్.రెడ్డి లు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించి స్వీట్లు తినిపించారు.

నాచినపల్లి హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దుగ్గొండి, మే 17, ప్రభాతవార్త

ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ చెట్లక్రింద కలుసుకున్న వేళ. మండలంలోని నాచినపల్లి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులు 2008-09 పదో తరగతికి చెందిన 90మంది విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 17 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులకు శాలువాలు, మెమోంటోలు, బోకేలతో ఘనంగా సన్మానం చేశారు. చదువు నేర్చుకున్న తరగతి గదిని ఒక్కసారి తిరిగి గతంలో జరిగిన వాటిని నెమరు వేసుకున్నారు. 90 మంది విద్యార్థులు వివిధ స్థాయిలో స్థిరపడ్డారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేందర్, సోమదాస్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, అరుణ, ప్రమోదిని, విద్యార్థులు, రాజు, వినోద్, రవీందర్, అరుణ్, అన్నెబోయిన కవిత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల సృష్టే లక్ష్యంగా విద్యార్థులు చదవాలి

విద్యార్థులు నైపుణ్యాలతో ముందుకు సాగాలి

ప్రపంచ ఉపాధ్యాయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి

ఎం.వి గోనారెడ్డి

నకిరేకల్, ప్రభాతవార్త ,మే 17, విద్య మాత్రమే సమాజంలో అసమానతలను తొలగించగలదని, విద్యార్థులు మార్కెట్‌కు అనుసంధానమైన నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ప్రపంచ ఉపాధ్యాయ సమాఖ్య ప్రధానకార్యదర్శి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఒ, విద్యావేత్త ఎం.వి గోనారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విద్యా వారోత్సవాలు – విద్య విజయోత్సవం ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగాలు అడిగేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే శక్తివంతులుగా ఎదగాలని సూచించారు. ఉన్నత విద్య పొందిన ప్రతి విద్యార్థికి ఉత్పాదకత, సేవారంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేలా కళాశాలలు పరిశ్రమలతో అనుసంధానంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యాపకుల అంకితభావం ఉంటే అడ్మిషన్లు స్వయంగా పెరుగుతాయని, డిగ్రీ స్థాయిలోనే స్కిల్ సెట్ అభివృద్ధి చెందితే విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా రాణించగలరని ఆయన తెలిపారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ప్రజాగాయని నిర్మల మాట్లాడుతూ మహిళలకు స్వావలంబన విద్య ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. సభలో ఆమె మహిళా చైతన్య గీతాలను ఆలపించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రతీక్ ఫౌండేషన్ తరఫున కళాశాల లైబ్రరీకి పోటీపరీక్షల స్టడీ మెటీరియల్‌ను ఎం.వి గోనారెడ్డి అందజేశారు. ప్రధానాచార్యులు, ప్రొఫెసర్ బెల్లి యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు, చరిత్ర సహాచార్యులు కే ప్రవీణ్ రెడ్డి, అధ్యాపకులు ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్, హరిత, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ శంకర్, ఉపేందర్, శివశంకర్, రవీందర్, నరసింహ చారి, సుభాషిని, సిబ్బంది వెంకన్న, సుదర్శన్, కార్తీక్ విద్యార్థులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

చింతలపాలెం (ప్రభాతవార్త) మే 17:

పది ఫలితాల్లో 500 మార్కులకు పైగా సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన డి.శ్రావ్య 525, వేద మల్లిక 521, ముబీనా 514, మానస 507, అను నలుగురు విద్యార్థినులను మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు విద్యా వారోత్సవాలలో భాగంగా మండల విద్యాధికారి నారపరాజు శ్రీనివాస్ ఆదివారం ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండలంలో అత్యధిక శాతం ఎఫ్ ఆర్ఎస్ (అటెండెన్స్) పొందిన ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ ఉపాధ్యాయుడు శ్రీనివాసచారిని, వంద శాతం ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ సాధించిన ఎంపీపీఎస్ కొత్తగూడెం విద్యార్థి నరేష్ లను కూడా మండల విద్యాధికారి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు కూడా పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరై విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు గ్రామ పెద్దలు సౌండ్ మియా, మక్బుల్ కూడా పాల్గొని విద్యార్థులకు సన్మానం చేయడం నగదు బహుమతులను అందజేయడం జరిగినది.

రాష్ట్ర పెరిక కో ఆపరేటివ్ సొసైటీ చైర్మెన్ కు సన్మానం

హుజూర్ నగర్ రూరల్, మే 17 ,ప్రభాతవార్త

రాష్ట్ర పెరిక కోఆపరేటివ్ సొసైటీ చైర్మెన్ గా ఎన్నికైన దొంగరి వెంకటేశ్వర్లు ను ఆదివారం మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతో బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేసి ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసపురం గ్రామ నాయకులు సింగిల్ విండో చైర్మెన్ కట్ట గోపాల్ రావ్, కట్టా రమేష్, బాబు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సమ్మెట సుబ్బరాజు, శ్యాంబాబు, కుక్కడపు శ్రీనివాస్ గౌడ్, పోతబత్తిన ప్రసాద్, బాల స్వామి,లింగగిరి,రాఘవరావు,శ్రీనివాస్, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అడపిల్లపుడితే రూ 5116 లు కానుక

హుజూర్ నగర్ రూరల్, మే17, ప్రభాతవార్త:

హుజూర్ నగర్ మండలం మర్రిగూడెం గ్రామములోని ఆడపిల్ల వివాహ కానుకగా రూ 5116 , గ్రామంలో పుట్టిన ప్రతీ ఆడపిల్లకు రూ 5116 లు కానుకగా అందిస్తున్నట్లు గ్రామానికి చెందిన పోతురాజు చంద్రశేఖర్ నాగజ్యోతి దంపతులు తెలిపారు. గ్రామానికి చెందిన ఇటీవల ఉబ్బలపల్లి మల్లేష్ శిరిషా దంపతులకు జన్మించిన చిన్నారి కి రూ5116 లు ఆదివారం అందజేశారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆడపిల్లలను భారంగా భావించే ప్రస్తుత తరుణంలో ఆడపిల్ల పుట్టటంతోనే ఆ ఇంటికి లక్ష్మీదేవి తో వస్తుందని భరోసా కల్పించడమే లక్ష్యముతో తమ తండ్రి పోతురాజు లింగయ్య జ్ఞాపకార్థము ఈ సేవా కార్యక్రమాన్ని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ నాజియా పాషా, ఉప సర్పంచ్ మొక్క శివ ఆదినారాయణ, షేక్ మోలానా,సయ్యద్ అస్మతుల్లా, తోట బిక్షం, సయ్యద్ జామియా, సయ్యద్ రబ్బాని, సయ్యద్ మీరస, షేక్ అల్లా బక్షు, పోతురాజు నాగరాజు, తోట కోటేశ్వరరావు, సన్నిధి వెంకట నరసయ్య, కడియం కొండలు, పేరుపొంగు మల్లేష్, రమణ బోయిన వేణుగోపాలు, తోట కోటేశ్వరరావు, సయ్యద్ మొహినుఉద్దీన్, పోతురాజు శ్రీను, సయ్యద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ రుక్మిణమ్మకు నివాళి

హుజూర్ నగర్ టౌన్, మే 17, ప్రభాత వార్త :

హుజూర్‌నగర్ పట్టణ గౌడ కుల పెద్ద గౌడు బెల్లంకొండ చిరంజీవి, బిఆర్ఎస్ పట్టణ కార్యదర్శి బెల్లంకొండ అమర్ మాతృమూర్తి బెల్లంకొండ రుక్మిణమ్మ వర్ధంతి దశదినకర్మ ఆదివారం పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గౌడ సంఘ, ప్రముఖ లు, పలు పార్టీల నాయకులు కార్య క్రమంలో పాల్గొని దివంగత బెల్లం కొండ రుక్మిణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధా న కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు, ఎస్ఐ బెల్లంకొండ రామచం దర్ , కౌన్సిలర్లు అట్లూరి మంజుల, దొంతి రెడ్డి పద్మ, బిఆర్ఎస్ నాయ కులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కె.ఎల్.ఎన్. రెడ్డి, నగేష్ రాథోడ్, పసుపులేటి నరసింహారావు, నాగార్జున, నాగశే ఖర్, మెరుగ వంశీ, శీలం నాగరాజు, కస్తాల రామకృష్ణ శ్రీనివాసరాజు, చల్లా రమేష్ నాయకులు బెల్లం కొండ శ్రీనివాస్, ఐల వెంకన్న గౌడ్ మేళ్ల చెరువు ముక్కంటి, బెల్లం కొండ రామజోగి, రాజా, రణపొంగు రాము, కస్తాల రవీందర్, పాలకూరి బాబు తదితరులు పాల్గొన్నారు

మానవత్వాన్ని చాటుకున్న డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్

మహిళకు పునర్జన్మ ప్రసాదించిన పవన్ సాయి హాస్పిటల్స్

కట్టంగూర్, మే 17, ప్రభాతవార్త. ఆపదలో ఉన్న పేద ప్రజలకు తానేనంటూ నిలిచే ప్రముఖ వైద్యులు, పేద ప్రజల పెన్నిధి డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక మహిళకు అత్యవసర వైద్యం అందించి, ఆమె నిండు ప్రాణాన్ని కాపాడారు. ఘటన వివరాల్లోకి వెళితే.. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన వేముల చంద్రయ్య భార్య వేముల పార్వతమ్మ ప్రమాదవశాత్తు అకస్మాత్తుగా కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె కడుపులోని ప్లీహం పగిలిపోవడంతో తీవ్ర రక్తస్రావమై, పరిస్థితి విషమంగా మారింది. బాధిత కుటుంబ సభ్యులు వెంటనే పవన్ సాయి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ ని సంప్రదించారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన, ఏమాత్రం ఆలస్యం చేయకుండా పేషెంట్‌ను తక్షణమే పవన్ సాయి హాస్పిటల్స్‌కు తరలించాలని సూచించారు. కార్పొరేట్ వైద్యం.. అతి తక్కువ ఖర్చుతో.. హాస్పిటల్‌కు చేరుకున్న పార్వతమ్మకు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షణలో వైద్య బృందం అత్యంత వేగంగా స్పందించి అత్యవసర చికిత్స అందించింది. ఎంతో క్లిష్టమైన ఈ పరిస్థితి నుండి ఆమెను సురక్షితంగా బయటపడేసి, ప్రాణాపాయం తప్పించారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని, పేద కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని అతి తక్కువ ఖర్చుతోనే అందించడం విశేషం. ప్రస్తుతం పార్వతమ్మ పూర్తిగా కోలుకోవడంతో, హాస్పిటల్ సిబ్బంది ఆమెను ఆనందంగా డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. ..మా పాలిట దేవుడు.. శ్రీనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.... "ప్రాణాపాయ స్థితిలో ఉన్న మా మనిషిని కాపాడి మా ఇంట్లో వెలుగులు నింపిన డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ గారికి, పవన్ సాయి హాస్పిటల్స్ యాజమాన్యానికి మేము జీవితాంతం రుణపడి ఉంటాం. శ్రీనన్న మా పాలిట దేవుడు" అని బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ తమ కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ చేసిన ఈ గొప్ప సేవపై స్థానికులు మరియు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెలిమినేడులో వ్యభిచార స్థావరంపై పోలీసుల దాడి

పోలీసుల అదుపులో ఏడుగురు విటులు, ఏడుగురు మహిళలు

చిట్యాల రూరల్, మే 17, ప్రభాతవార్త : చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న ఓ వ్యభిచార స్థావరాలపై నల్గొండ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు విటులను, సూర్యాపేటకు చెందిన ఏడుగురు మహిళలను టాస్క్ ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన మహిళలను సఖి కేంద్రానికి తరలించి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

ఆకలి ...అనాధ జీవితం

చివరకు టాయిలెట్ లోనే నివాసం

బతికేందుకు చోటు లేక పాడుబడిన మరుగుదొడ్డిలో

మానవత్వం విలవిల

సమాజాన్ని కలిసి వేస్తున్న నిరాశ్రయులైన బతుకు

మానవత్వం మట్టిలో..

మరుగుదొడ్డిలో మహిళా నివాసం

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త :

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో వెలుగుచూసిన ఓ హృదయ విదారక ఘటన సమాజాన్ని కలచివేస్తోంది. ప్రజల వినియోగం కోసం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్ నేడు ఓ నిరాశ్రయ మహిళకు శాశ్వత ఆశ్రయంగా మారింది. చెరువు కట్ట ప్రాంతంలోని ఉపయోగంలో లేని మరుగుదొడ్డిలో ఏడాదికిపైగా జీవనం సాగిస్తున్న మహిళ పరిస్థితి సంక్షేమ పాలన, మానవత్వం, ప్రభుత్వ యంత్రాంగంపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.తన పేరు మనిషాబాయి అని, తాను మహారాష్ట్రకు చెందినదినని చెప్పుకుంటున్న ఈ మహిళ గత కొంతకాలంగా మోత్కూర్ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ జీవిస్తోంది. మొదట్లో బస్‌స్టాండ్‌లు, దుకాణాల ముందరి వరండాలు, చెట్ల కింద రాత్రులు గడిపిన ఆమెకు చివరకు తలదాచుకునే చోటు కూడా లేకపోవడంతో చెరువు కట్టపై ఉన్న పాడుబడిన పబ్లిక్ టాయిలెట్‌నే నివాసంగా మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రస్తుతం అదే మరుగుదొడ్డి ఆమెకు ఇల్లు.. అదే విశ్రాంతి స్థలం.. అదే రాత్రి రక్షణ. అక్కడే పాత బట్టలు, ప్లాస్టిక్ కవర్లు, కొద్దిపాటి పాత్రలు పెట్టుకొని జీవనం సాగిస్తోంది. వర్షం వచ్చినా.. ఎండ మండినా.. ఆకలి వేధించినా.. అదే నాలుగు గోడల మధ్య ఆమె బతుకు పోరాటం కొనసాగుతోంది.స్థానికుల కథనం ప్రకారం కొందరు ఆమెకు అప్పుడప్పుడు ఆహారం ఇస్తుంటే, మరికొందరు అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరిస్తున్నారని తెలుస్తోంది. రాత్రివేళ ఒంటరిగా అక్కడే ఉండాల్సి రావడం వల్ల ఆమె భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మహిళగా కనీస రక్షణ లేకుండా జీవించడం స్థానికులను కలచివేస్తోంది.ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉందని స్థానికులు చెబుతున్నారు. పరిశుభ్రత లేని వాతావరణం, దోమలు, దుర్వాసనలు, సరైన ఆహారం లేకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. మానసిక స్థితి కూడా పూర్తిగా సాధారణంగా లేదని కొందరు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు వైద్య శాఖ గానీ, మహిళా సంక్షేమ శాఖ గానీ, మున్సిపల్ అధికారులు గానీ స్పందించలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక్కడ నిత్యం అధికారుల, ప్రజాప్రతినిధుల హడావిడినే..

.ప్రతిరోజూ ప్రజాప్రతినిధులు, అధికారులు రాకపోకలు సాగించే ప్రాంతంలోనే ఈ దృశ్యం కనిపిస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు.. నిరాశ్రయుల కోసం ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రకటించే అధికారులు.. ఓ మహిళ మరుగుదొడ్డిలో నివసిస్తున్న దుస్థితిని ఎందుకు గుర్తించలేకపోయారనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి.బిక్షాటన చేస్తే మనిషికి గౌరవంగా జీవించే హక్కు ఉండదా?నిరాశ్రయ మహిళల కోసం ప్రభుత్వ ఆశ్రయ గృహాలు ఎక్క?మహిళా భద్రతపై మాట్లాడే నాయకులకు ఈ మహిళ కనిపించలేదా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొందరు సామాజిక కార్యకర్తలు వెంటనే స్పందించి ఆమెను రక్షిత ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

పాలకులు ఎలా స్పందిస్తారో...

సామాజికవేత్తల అభిప్రాయం ప్రకారం ఇది కేవలం ఒక్క మహిళ సమస్య మాత్రమే కాదు.. సమాజం అంచుల్లో బతుకుతున్న నిరాశ్రయుల అసలు జీవన చిత్రమని అంటున్నారు. అభివృద్ధి, సంక్షేమం, మహిళా సాధికారత వంటి పదాలు కేవలం సభల ప్రసంగాల్లో కాకుండా వాస్తవ జీవితాల్లో కనిపించాలంటే ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి ఆ మహిళకు ఆశ్రయం, ఆహారం, వైద్య సాయం అందించడంతో పాటు ఆమె కుటుంబ వివరాలు సేకరించి పునరావాసం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.చెరువు కట్టపై మరుగుదొడ్డిలో జీవిస్తున్న ఈ మహిళ కథ.. అభివృద్ధి నినాదాల వెనక దాగి ఉన్న సమాజపు చేదు నిజాన్ని మరోసారి బయటపెట్టింది.

సుందరయ్య నగర్‌లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్...

65 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు సీజ్...

నలుగురు అనుమానితుల గుర్తింపు.

సూర్యాపేట, మే 17 (ప్రభాత వార్త) :

శాంతి భద్రతల పరిరక్షణ, అనుమానిత వ్యక్తుల కదలికల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన లక్ష్యంగా సూర్యాపేట పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ నేతృత్వం వహించారు.సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఈ తనిఖీల్లో కాలనీలోని ప్రతి ఇంటిని పరిశీలించారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఆశ్రయం

పొందారా, దొంగతనాలకు సంబంధించిన వాహనాలు ఉన్నాయా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ప్రజలకు భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందన్నారు.కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి నిర్ధారణ లేకుండా ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దన్నారు.ప్రతి వాహనానికి సరైన పత్రాలు ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని, వాటి సరఫరా లేదా వినియోగంపై సమాచారం అందించాలని కోరారు.గంజాయి అలవాటు నుంచి బయటపడేందుకు జిల్లా ఆసుపత్రిలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని సుమారు 65 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా అనుమానితులను తనిఖీ చేయగా, గతంలో నేరాలకు పాల్పడిన నలుగురిని గుర్తించినట్లు డీఎస్పీ వెల్లడించారు. పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ, ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఏడుకొండలు, మహేందర్ నాథ్, శివతేజ, ఐలయ్య, బాలు నాయక్, సైదిరెడ్డి, కనకరత్నం, వెంకన్న, ఏఎస్ఐలు నరేందర్ రెడ్డి, ముత్తయ్య, వెంకన్నతో పాటు స్పెషల్ పార్టీ, పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వై టి పి ఎస్ లో అగ్నిప్రమాదం .

.దగ్ధమైన కేబుళ్ళు, ఆస్తి నష్టం

3 రోజుల క్రితమే ఉత్పత్తి ప్రారంభించిన 3వ యూనిట్ .

.సిబ్బంది అప్రమత్తతో తప్పిన పెను ముప్పు

మిర్యాలగూడ, మే 17 ప్రభాతవార్త:

నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని ప్రతిష్టాత్మక యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ (వై టి పి ఎస్)లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మూడు రోజుల క్రితమే ఉత్పత్తి ప్రారంభించిన 3వ యూనిట్లో విద్యుత్ ఆయిల్ లికేజి, షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం.

షార్ట్ సర్క్యూట్ జరిగిన వెంటనే దట్టమైన పొగలు, మంటలు వ్యాపించడంతో ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం గుర్తించిన అధికారులు అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేయగా ఫైర్ సేఫ్టీ పరికరాల సహాయంతో మంటలను వెంటనే అదుపులోకి తెచ్చారు. దీంతో మంటలు ఇతర విభాగాలకు వ్యాపించకుండా అడ్డుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధికారుల అప్రమత్తతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కంట్రోల్ కేబుల్స్,వాల్వ్ లు దెబ్బతిన్నప్పటికీ మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా సకాలంలో చర్యలు తీసుకోవటంతో ప్రధాన యంత్రాలకు ముప్పుతప్పింది. పంపు వద్ద ఆయిల్ లీకేజీ కావడం, షార్ట్ సర్క్యూట్ జరగటం వల్ల ప్రమాదం జరిగినట్లు

ప్రాథమికంగా అంచనావేసిన అధికారులు,విచారణ చేపట్టారు. మూడు రోజుల క్రితమే మూడవ యూనిట్ సి ఓ డి (సింక్రోనైజేడ్) పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించగా స్వల్ప వ్యవధిలోనే ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం. గతంలో కూడా యూనిట్ 1 లో అగ్ని ప్రమాదం జరిగి భారీ ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. 4000 మెగా యూనిట్ల ఉత్పత్తి సామర్థంతో చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ లో 8 యూనిట్ల ఉత్పత్తి సామర్థం గల 5 యూనిట్లను నిర్మిస్తున్నారు. దీనిలో 1, 2,4వ యూనిట్ల లో ఉత్పత్తి ప్రారంభం కాగా, మూడు రోజుల క్రితమే మూడవ యూనిట్ ను ప్రారంభించడం జరిగింది. మిగిలిన 5వ యూనిట్ త్వరలో పూర్తి కానుంది. 29వేల కోట్లతో ప్రారంభించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్ణీత సమయానికి పూర్తి కాకపోవటంతో పాటు, ప్రభుత్వాలు మారటం, యంత్రాల ధరలు పెరగడంతో అంచన వ్యయం దాదాపు 55 వేల కోట్లకు చేరుకున్నట్లు సమాచారం. దీనికి తోడు వరుస ప్రమాదాలతో వ్యయం మరింతగా పెరిగి.ప్రభుత్వానికి గుదిబండలా తయారవుతుందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

నేడు మోతె మండలంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పర్యటన

మోతె, మే 17 ప్రభాత వార్త ..

కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సోమవారం మోతె మండలంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు మామిళ్ళగూడెం గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం 1.30 గంటలకు మోతె స్వస్తిక్ ఫంక్షన్ హాల్లో హైదరాబాద్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు కుమార్తెల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొంటారు.తదుపరి మధ్యాహ్నం 2 గంటలకు మోతె మండల కేంద్రంలో నూతన జిల్లా సహకార సంఘం బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం 2.30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించనున్నారని,ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ అనుబంధ సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.